**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 118, పేజీలు - 08

గురువారం,అక్టోబర్ 29, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# కరువు కోరల్లో తెలంగాణ!

## - 365 మండలాల్లో కరువు విలయతాండవం

- 111 మండలాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు.. 254 మండలాల్లోనూ నీటి ఎద్దడి
- 139 లక్షల ఎకరాల నుంచి 126 లక్షల ఎకరాలకు పడిపోయిన సాగు విస్తీర్ణం
- రాష్ట్ర రిజర్వాయర్లలో 585 టీఎంసీలకు గాను 179 టీఎంసీల నీరే
- రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కోసం కేంద్రానికి తెలంగాణ విజ్ఞప్తి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** వానాకాలం వచ్చిందని రైతన్నలు ఆశగా ఆకాశం వైపు చూశారు. తొలకరి చినుకులతో పుడమి తల్లి పులకరిస్తుందని, పొలాలు పచ్చదనంతో కళకళలాడతాయని ఆశించారు. కానీ వరుణుడు మాత్రం ముఖం చాటేశాడు. మరోవైపు అర్నాబ్ తుఫాన్ ప్రభావం కూడా ఆశించిన స్థాయిలో వర్షాలను అందించలేకపోయింది. నైరుతి రుతుపవనాల కాలంలో వరుసగా నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, బంగాళాఖాతంలో బలహీనపడిన ద్రోణులు, ఎల్‌నినో ప్రభావం వెరసి తెలంగాణ వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టాయి. జూన్ నుంచి సెప్టెంబరు చివరి వరకు కురవాల్సిన సాధారణ వర్షపాతం కంటే 17 శాతం తక్కువగా వర్షాలు నమోదు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా కరువు ఛాయలు అలుముకున్నాయి. ఫలితంగా తెలంగాణలోని 31 జిల్లాల పరిధిలో 365 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు ఆరు నెలల పాటు అమల్లో ఉండనున్నాయి. దీంతో రాష్ట్రంలో వ్యవసాయ సంక్షోభం తీవ్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది.

### కుదేలైన సాగు.. రైతన్నకు కష్టకాలం!

వర్షాభావ పరిస్థితులు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపాయి. సాగునీటి లభ్యత తగ్గడం, భూగర్భ జలాలు ఆశించిన స్థాయిలో అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. గతంలో సుమారు 139 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా, ఈ వానాకాలంలో ఆ విస్తీర్ణం 126 లక్షల ఎకరాలకు పరిమితమైంది. అంటే దాదాపు 13 లక్షల ఎకరాల్లో సాగు తగ్గినట్లు స్పష్టమవుతోంది.రాష్ట్ర వ్యవసాయానికి ప్రధాన ఆధారమైన వరి సాగు సైతం తీవ్రంగా దెబ్బతింది. గతంలో సుమారు 69 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, ఈసారి 18 శాతం తగ్గి 57 లక్షల ఎకరాలకే పరిమితమైంది. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పంటల సాగు ప్రణాళికలు తారుమారయ్యాయి. పెట్టుబడులు పెట్టిన రైతులు దిగుబడులపై ఆందోళన చెందుతున్నారు. సాగు తగ్గడం, పంటల ఎదుగుదలకు అవసరమైన నీరు అందకపోవడం వ్యవసాయ

2లో..

# కాంగ్రెస్ ఖాతా తెరిచిందా.?

## - మోనోకిల్ ఎమోజీతో కాంగ్రెస్‌పై మోదీ సెటైర్

- నాలుగు రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు
- 12 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్
- కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కని వైనం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్, ఎన్నికల అక్రమాల మీద జాతీయ స్థాయిలో పోరాటాలకు నేతృత్వం వహిస్తున్న విపక్ష కాంగ్రెస్ పార్టీ తాజాగా పలు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో మాత్రం చతికిలపడింది. ముఖ్యంగా నాలుగు పెద్ద రాష్ట్రాలు ఉత్తర్ ప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, కర్నాటకలో 28 సీట్లకు జరిగిన ఉపఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెల్చుకోలేక జీరోకు పరిమితం కావడం చర్చనీయాంశంగా మారింది. అందులోనూ అధికారంలో ఉన్న కర్నాటకలో సైతం ఒక్క సీటు కూడా గెల్చుకోలేక నాలుగు చోట్ల బీజేపీ-జేడీఎస్ చేతిలో ఓటమిపాలవ్వడం ఆ పార్టీకి మింగుడు పడటం లేదు. ఈ నేపథ్యంలో జాతీయ స్థాయిలో తమపై పోరాటాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇలా పెద్ద రాష్ట్రాల్లో, అదీ ఈవీఎంలు కాకుండా బ్యాలెట్ పేపర్లతో జరిగిన ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోవడంపై ప్రధాని మోడీ స్పందించారు. ఎక్స్ లో పెట్టిన ట్వీట్ లో దీనిపై వ్యంగాస్త్రాలు సంధించారు. 4 పెద్ద రాష్ట్రాలైన ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, కర్ణాటకలలోని 28 స్థానాలకు ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయని, బ్యాలెట్ పత్రాల ద్వారా ఈ ఎన్నికలు జరిగాయని, అందులో కాంగ్రెస్ ఎన్ని సీట్లు గెలుచుకుందో ఊహించండి?

2లో..

# హైదరాబాద్‌లో తాగునీటి సమస్య రావొద్దు

## - అధికారులకు సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

- నగరానికి నీటి గండం రాకుండా సీఎం ముందస్తు చర్యలు
- తాగునీటి పొదుపే లక్ష్యం.. ఇతర అవసరాలకు శుద్ధి జలాలు
- భవన నిర్మాణ అనుమతులప్పుడే ట్రీటెడ్ వాటర్ నిబంధన



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగరంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత శాఖ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో నీటి అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అదే సమయంలో తాగునీటిని పొదుపుగా వినియోగిస్తూ ఇతర అవసరాలకు శుద్ధి చేసిన మురుగునీటిని ఉపయోగించే విధానాన్ని విస్తృతంగా అమలు చేయాలని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి.. హైదరాబాద్‌లో తాగునీటి సరఫరా , మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టీపీలు), శుద్ధి చేసిన

2లో..

# సహాయ చర్యలు వేగవంతం చేయాలి

## - తుపాను ప్రభావం తగ్గే వరకు క్షేత్ర స్థాయి విధుల్లోనే ఉండాలి



**అమరావతి (ప్రశ్న న్యూస్)** అర్నబ్ తీవ్ర తుపాను తీరం దాటిన నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం మొత్తం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, తుపాను ప్రభావం పూర్తిగా తగ్గేంత వరకు అధికారులు క్షేత్ర స్థాయిలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. బాపట్ల నుంచి శ్రీకాకుళం వరకు తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో బుధవారం మధ్యాహ్నం ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

2లో..

# నష్టపోయిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తాం

- అర్నబ్ తుపాను బాధితుల కోసం ఏపీ ప్రభుత్వం భారీ పరిహార ప్యాకేజీ
- మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు, ఇళ్ల నష్టానికి ఆర్థిక సాయం
- వ్యవసాయ, ఉద్యాన పంటలకు హెక్టారుకు రూ. 35,000 వరకు పరిహారం
- తుఫాను నష్టంపై కేంద్రానికి ప్రాథమిక నివేదిక, కేంద్ర బృందాన్ని కోరిన సీఎం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** అర్నబ్ తుఫానుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం సాయంత్రం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 3 రోజులుగా ఎనిమిది సమీక్షలు నిర్వహించి, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్టు తెలిపారు. క్షేత్రస్థాయిలో 30 వేల మంది ఉద్యోగులు, సిబ్బందిని మోహరించి, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ వారికి సూచనలు చేసిన విషయం వెల్లడించారు. గత రాత్రి 2 గంటల వరకు జిల్లా కలెక్టర్లు, అధికారులతో సమీక్ష నిర్వహించినట్టు వివరించారు. సేఫ్, సెక్యూరిటీ, రిహాబిటేషన్ అనుసరిస్తూ ముందుకెళ్లామని చంద్రబాబు తెలిపారు. తుఫానుతో ఆస్తి, పంట నష్టపోయినవారికి న్యాయం చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రతి చివరి బాధితుడికి సహాయం అందాలని ఆయన సూచించారు. అలాగే, బాధితులకు ఉచితంగా నిత్యావసరాలను అందజేయనున్నట్టు చంద్రబాబు ప్రకటించారు.

2లో..

# రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది

## - కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ రావు ధ్వజం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మూసీ నది ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు హాజరుకాకుండా బీఆర్ఎస్ నేతలను గృహనిర్బంధం చేశారని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పాలన సాగిస్తూ, ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. హైదరాబాద్‌లోని వాలంతరిలో మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ జరగాల్సి ఉంది. ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి సిద్ధమైన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆమె కుమారుడు కార్తీక్ రెడ్డిలను పోలీసులు శ్రీనగర్

2లో..

# ప్రభుత్వ సేవల్లో ఏఐ

## - 'ఏఐ సాక్షమ్' కార్యక్రమం ప్రారంభం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వ సేవలను మరింత వేగవంతం, పారదర్శకం చేసే లక్ష్యంతో ప్రభుత్వం 'ఏఐ సాక్షమ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచేందుకు ఉద్దేశించిన ఈ కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హైదరాబాద్‌లో ప్రారంభించారు. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం యొక్క ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో జరిగిన ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల వేగం పెంచి, ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రైతులు, పింఛనుదారులు వంటి వారు పదేపదే ఆఫీసుల చుట్టూ తిరిగే దుస్థితికి చరమగీతం పాడాలన్నారు. ప్రభుత్వ నిధుల వినియోగం, సంక్షేమ పథకాలు అర్హులకు చేరుతున్నాయా లేదా అనే విశ్లేషణ, విద్యుత్ డిమాండ్ అంచనా వంటి పనులకు ఏఐ ఎంతగానో తోడ్పడుతుందని వివరించారు. అదే సమయంలో ఏఐ వినియోగంలో పలు జాగ్రత్తలు తప్పనిసరి అని భట్టి నొక్కిచెప్పారు. ఏఐ అందించిన సమాచారాన్ని అధికారులు కచ్చితంగా ధ్రువీకరించుకోవాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత డేటా

2లో..

# రేషన్ బియ్యంతో పాటు 6 రకాల సరుకులు

## - సంక్రాంతి నుంచి పంపిణీకి సర్కార్ యోచన



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎల్ నినో కరువు పరిస్థితులు, ధరల పెరుగుదల నేపథ్యంలో పేద కుటుంబాలకు మరింత ఆహార భద్రత కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రతిపాదనను పరిశీలిస్తోంది. ప్రస్తుతం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్న సన్నబియ్యంతోపాటు ఇతర నిత్యావసర వస్తువులను కూడా రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయాలని యోచిస్తోంది. కందిపప్పు, పామాయిల్, చింతపండు, కారంపొడి, చక్కెర, గోధుమపిండిని అందించే అంశంపై ప్రాథమికంగా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అన్నీ అనుకున్నట్లు జరిగితే వచ్చే సంక్రాంతి నుంచి ఈ పథకాన్ని అమలు చేసే అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది.ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ కింద అర్హులైన కుటుంబాలకు సన్నబియ్యం మాత్రమే

2లో..

# తెలంగాణలో ఐఏఎస్ అధికారుల బదిలీలు

## - అటవీ శాఖకు జయేష్ రంజన్, ఇంధన శాఖకు వికాస్ రాజ్




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వంలో పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. కీలక శాఖలకు నూతన అధికారులను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పలువురు అధికారులకు కొత్త పోస్టింగులు కేటాయిస్తూ పరిపాలనలో మార్పులు చేపట్టింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్‌ను పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్ రాజ్‌కు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు గ్రామీణ నీటి సరఫరా శాఖల బాధ్యతలను నవీన్ మిట్టల్‌కు కేటాయించారు.

2లో..

# కరువు కోరల్లో తెలంగాణ!

రంగానికి కొత్త సవాళ్లను విసురుతోంది.

### 111 మండలాల్లో తీవ్ర కరువు!

రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన 365 కరువు మండలాల్లో పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. వీటిలో 111 మండలాలను తీవ్ర కరువు ప్రభావిత ప్రాంతాలుగా వర్గీకరించగా, మరో 254 మండలాలను సాధారణ కరువు ప్రాంతాలుగా గుర్తించింది. వర్షపాతం లోటు, సాగు పరిస్థితులు, నీటి లభ్యత వంటి అంశాల ఆధారంగా ఈ వర్గీకరణ చేపట్టినట్లు తెలుస్తోంది. కరువు ప్రభావం మరింత తీవ్రమయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

### జలాశయాల్లో అడుగంటుతున్న నీరు!

వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో రాష్ట్రంలోని ప్రధాన, మధ్యతరహా జలాశయాల్లో నీటి నిల్వలు ఆందోళన కలిగిస్తున్నాయి. రాష్ట్ర రిజర్వాయర్ల మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 585 టీఎంసీలు కాగా, ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీరు కేవలం 179 టీఎంసీలకే పరిమితమైంది. అంటే మొత్తం సామర్థ్యంలో మూడో వంతుకు కొద్దిగా మాత్రమే నీరు నిల్వ ఉంది. ఈ పరిస్థితి రాబోయే రోజుల్లో సాగునీటి అవసరాలతో పాటు తాగునీటి సరఫరాపైనా ప్రభావం చూపే ప్రమాదం ఉంది.జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గితే వ్యవసాయానికి అవసరమైన నీటిని అందించడం కష్టమవుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉండటంతోపాటు పశువులకు మేత, నీటి లభ్యతపైనా ప్రభావం పడవచ్చు. జలవిద్యుత్ ఉత్పత్తికి కూడా ఆటంకాలు ఏర్పడే ప్రమాదం కనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించడంతోపాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది.

### కేంద్ర సాయం కోసం ఎదురుచూపులు!

కరువు ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణ శాసనసభ కీలక నిర్ణయం తీసుకుంది. కరువు పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక బృందాన్ని పంపాలని కోరుతూ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించింది. రైతులు, వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమించేందుకు కేంద్రం నుంచి ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేసింది. రాష్ట్రానికి రూ.20,000 కోట్ల ప్రత్యేక కరువు ఉపశమన ప్యాకేజీ మంజూరు చేయాలని అసెంబ్లీ కేంద్రాన్ని కోరింది. వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించేందుకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అదనంగా 50 రోజుల పనిదినాలు కల్పించాలని ప్రతిపాదించింది. సాగునీటి ప్రాజెక్టుల పునరుద్ధరణ, తాగునీటి సరఫరా, అదనపు విద్యుత్ అందుబాటు, ఎరువుల సరఫరా వంటి అంశాల్లోనూ కేంద్రం సహకారం అందించాలని విజ్ఞప్తి చేసింది.

### రైతన్నకు భరోసా ఎప్పుడో.?

ఒకవైపు వర్షాభావం, మరోవైపు తగ్గుతున్న సాగు విస్తీర్ణం. ఇంకోవైపు అడుగంటుతున్న జలాశయాలు ఈ పరిణామాలు తెలంగాణ రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. కరువు మండలాల ప్రకటనతో సమస్య తీవ్రత అధికారికంగా వెలుగులోకి వచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో రైతులకు ఎంత మేరకు ఉపశమనం లభిస్తుందన్నది కీలకంగా మారింది. కేంద్ర బృందం పర్యటన, ప్రత్యేక ప్యాకేజీ మంజూరు, ఉపాధి పనుల విస్తరణ వంటి అంశాలపై తదుపరి చర్యలు రైతులకు ఊరటనిస్తాయనే ఆశాభావం వ్యక్తమవుతోంది. కరువు కోరల్లో చిక్కుకున్న తెలంగాణను గట్టెక్కించేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

## కాంగ్రెస్ ఖాతా తెరిచిందా.?

అంటూ ఓ ఎమోజీ పెట్టి మోడీ ట్వీట్ చేశారు.తాజాగా ఎమ్మెల్సీ ఉపఎన్నికలు జరిగిన కర్నాటకలో బీజేపీ-జేడీఎస్ కూటమి నాలుగు సీట్లను గెలిచి క్లీన్ స్వీప్ చేసింది. ఇందులో బీజేపీ మూడు, జేడీఎస్ ఓ సీటు గెల్చుకున్నాయి. ఉత్తర్ ప్రదేశ్ లో సమాజ్ వాదీ పార్టీ రెండు సీట్లను, బీజేపీ ఐదు సీట్లను గెల్చుకున్నాయి. బీహార్ లో బీజేపీ, ఆర్జేడీ, జన్ సురాజ్, ఇండిపెండెంట్ ఒక్కో సీటు గెల్చుకున్నారు. మహారాష్ట్రలో అధికార, విపక్షాల మధ్య హోరాహోరీ నడుస్తున్నా అందులో కాంగ్రెస్ లేదు. దీంతో ఈ రాష్ట్రాల్లో కాంగ్రెస్ సున్నా సీట్లు గెల్చుకుందంటూ ప్రధాని మోడీ ట్వీట్ చేశారు. తద్వారా తనపై జాతీయస్థాయిలో కాంగ్రెస్ పోరాటాలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం తన హవానే కొనసాగుతుందని చెప్పకనే చెప్పినట్లయింది.

## నష్టపోయిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తాం

తుఫాను బాధితులకు అందజేసే ఆర్థిక సాయం వివరాలను సీఎం వెల్లడించారు. ఇళ్లలోకి నీళ్లు చేరిన కుటుంబాలకు 25 కిలోల చొప్పున, జాలర్లు, చేనేతలకు 50 కిలోల చొప్పున బియ్యం ప్రభుత్వం ఇవ్వనున్నట్టు సీఎం వెల్లడించారు. పశువులు నష్టపోతే రూ.50 వేలు, పత్తి, వేరుసెనగ, వరి, చెరకుకు హెక్టార్‌కు రూ.25 వేలు, పొగాకు, మినుములు, పెసలు, మొక్కజొన్న, సోయాబీన్, ప్రొద్దుతిరుగుడు, జనపనార, సామలు, కొర్రలకు హెక్టార్‌కు రూ.15 వేలు సాయం ప్రకటించారు. శిబిరాల్లో బాధితులకు వెయ్యి, ఇళ్లు దెబ్బతింటే రూ.10 వేలు, కిరాణా దుకాణాలు, రెస్టారెంట్లు దెబ్బతింటే రూ.25 వేలు, ద్విచక్రవాహనం దెబ్బతింటే 3 వేలు, త్రీవీలర్‌కు రూ.10 వేలు, రూ.40 లక్షల టర్నోవర్ ఉండే ఎంఎస్ఎంఈలకు రూ.50 వేలు, రూ.40 లక్షల నుంచి కోటిన్నరలోపు ఎంఎస్ఎంఈలకు రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించారు.

తుఫాను కారణంగా మృతిచెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు అందజేయనున్నారు. బోట్లు దెబ్బతింటే.. ఫిషింగ్ బోట్లకు రూ.9వేలు, వలలకు రూ.5వేలు, వలలు ఉండి దెబ్బతిన్న ఫిషింగ్ బోట్లకు రూ.25 వేలు సాయంగా అందజేయనున్నామని సీఎం తెలిపారు.అలాగే, ఆర్నబ్ తుఫాన్ నష్టం అంచనాలపై దృష్టి సారించాలని అధికారులు దిశానిర్దేశం చేశారు. పంటలు, ఉద్యానవన పంటలు, పశుసంపద, ఇళ్లు కూలిపోవడం, నీట మునగడం వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని సీఎం సూచించారు. విద్యుత్, రహదారుల వ్యవస్థలకు జరిగిన నష్టాన్ని, చెరువులకు పడిన గండ్లు అంశాలను క్షేత్రస్థాయి నుంచి సేకరించాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు.

# సహాయ చర్యలు వేగవంతం చేయాలి

పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని ఆదేశించారు. ముఖ్యంగా తుపాను తీరం దాటిన డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది పరిసరాలు, కాకినాడ జిల్లా తీర ప్రాంతాలపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. తన నియోజకవర్గమైన పిఠాపురం పరిస్థితిపై కూడా ఆరా తీశారు. ఉప్పాడ తీరంలో దెబ్బతిన్న రహదారి, కూలిపోయిన ఇళ్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. “ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. సహాయక చర్యలను మరింత పకడ్బందీగా చేపట్టాలి. తుపాను ప్రభావం తగ్గాక పంట నష్టం అంచనాలను అత్యంత పారదర్శకంగా నమోదు చేయాలి. చెరువుల గట్లు, వాగులు, వంకల్లో వరద ప్రవాహాన్ని నిరంతరం గమనిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలి” అని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

### గంటకు 140 కి.మీ. వేగంతో గాలుల బీభత్సం

ఈ సమీక్ష సందర్భంగా, అధికారులు తుపాను పరిస్థితిని ఉప ముఖ్యమంత్రికి వివరించారు. యానాంకు దక్షిణంగా అర్ధరాత్రి 1:20 గంటలకు ప్రారంభమైన తీరం దాటే ప్రక్రియ ఉదయం వరకు కొనసాగిందని తెలిపారు. ఈ సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచాయని, గరిష్ఠంగా గంటకు 140 కిలోమీటర్ల వేగాన్ని కూడా తాకాయని పేర్కొన్నారు.బాపట్ల, కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, అనకాపల్లి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఈ గాలుల విధ్వంసం అధికంగా ఉందని అధికారులు నివేదించారు. భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో అనేక ప్రాంతాల్లో రాకపోకలు, విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయాయని వివరించారు. గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు, పోలవరం ఏజెన్సీ ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నట్లు తెలిపారు. ఒక్క తూర్పు గోదావరి జిల్లాలోనే 93 రహదారులు దెబ్బతినగా, 736 చెట్లు నేలకొరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు.గాలుల తీవ్రత తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో రోడ్లపై కూలిన చెట్లను తొలగించడం, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం వంటి పనులు తక్షణమే ప్రారంభించామని కలెక్టర్లు తెలిపారు. తీర ప్రాంత గ్రామాల ప్రజలు పునరావాస కేంద్రాల్లో సురక్షితంగా ఉన్నారని, జిల్లాల వారీగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ల ద్వారా సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఉప ముఖ్యమంత్రికి వివరించారు.

## హైదరాబాద్‌లో తాగునీటి సమస్య రావొద్దు

నీటి వినియోగంపై అధికారులతో చర్చించారు. హైదరాబాద్ మహా నగర అవసరాలను దృష్టిలో ఉంచుకుని రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తాగునీటి సరఫరా వ్యవస్థపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో, క్యూర్ పరిధిలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు వంద శాతం సామర్థ్యంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఈ ఎస్టీపీ ప్లాంట్ల నిర్వహణలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని నీటి శుద్ధి ప్రక్రియలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. నీటి నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి ఎస్టీపీ వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని అన్ని ప్లాంట్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్లాంట్ల పనితీరును ఎప్పటికప్పుడు హైడ్రా అధికారులు పరిశీలించాలని సూచించారు. ఎస్టీపీల నిర్వహణకు సౌర విద్యుత్‌ను వినియోగించే అవకాశాలను కూడా పరిశీలించాలని రెడ్కో ఉన్నతాధికారులకు తెలిపారు. ప్రైవేట్ ఎస్టీపీల ఏర్పాటును ప్రోత్సహించాలని పేర్కొన్నారు.తాగునీటిపై ఒత్తిడి తగ్గించేందుకు శుద్ధి చేసిన నీటిని ఇతర అవసరాలకు వినియోగించాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయం, ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని ప్రాంతాలు, మెట్రో రైలు సహా ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణకు ట్రీటెడ్ వాటర్‌ను ఉపయోగించాలని సూచించారు. పబ్లిక్ పార్కుల నిర్వహణ, రోడ్ల శుభ్రత వంటి పనులకు కూడా శుద్ధి చేసిన నీటినే వినియోగించాలని తెలిపారు.భవన నిర్మాణ పనుల్లో శుద్ధి చేసిన నీటిని ఉపయోగించాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. భవన నిర్మాణ అనుమతుల సమయంలోనే ఈ నిబంధనను అమలులోకి తీసుకురావాలని సూచించారు. డేటా సెంటర్లకు సైతం శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఇలా తాగునీటికి ప్రత్యామ్నాయంగా ట్రీటెడ్ వాటర్ వినియోగాన్ని పెంచడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరత ముప్పును తగ్గించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే ట్యాంకర్లను ట్రాక్ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ట్రీటెడ్ వాటర్ వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ నీటి కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎస్టీపీల నిర్వహణ, శుద్ధి చేసిన నీటి సరఫరా, వినియోగానికి సంబంధించిన ఆదేశాలు నవంబర్ 1వ తేదీ నుంచి అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.ప్రస్తుతం 26 ఎస్టీపీల నుంచి గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని పంపిణీ చేస్తున్నట్లు జలమండలి అధికారులు, ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. వినియోగదారుల నుంచి నీటికి ధర వసూలు చేయకుండా కేవలం రవాణా రుసుము మాత్రమే తీసుకుంటున్నట్లు తెలిపారు. మొత్తంగా హైదరాబాద్‌లో తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు శుద్ధి చేసిన నీటిని విస్తృతంగా వినియోగించేలా వ్యవస్థను బలోపేతం చేయడంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం దృష్టి సారించింది.

## రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది

కాలనీలోని వారి నివాసంలో గృహ నిర్బంధం చేశారు. తెల్లవారుజాము నుంచే వారి ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించి, బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఈ ఘటనపై హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. “కరవుతో రైతులు అల్లాడుతుంటే ఆదుకోవడం చేతకాని ప్రభుత్వం, రూ. 1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన పేరుతో కమిషన్ల కోసం ప్రాజెక్టులు చేపడుతోంది” అని ఆరోపించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ, ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన ముసుగులో జరుగుతున్న దోపిడీ యత్నాలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుందని, కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డి కూడా అరెస్టులను ఖండించారు. ఇది అప్రజాస్వామిక చర్య అని, మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు అండగా నిలుస్తున్నందుకే తమను అక్రమంగా నిర్బంధించారని ఆరోపించారు. గృహనిర్బంధంలో ఉన్న బీఆర్ఎస్ నేతలను తక్షణమే విడుదల చేయాలని పార్టీ తరఫున డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ సేవల్లో ఏఐ

భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తామని, ఏఐ నిర్ణయాలపై మానవ పర్యవేక్షణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. చిన్నస్థాయి ప్రయోగాలు విజయవంతమైన తర్వాతే ఏఐ వ్యవస్థలను విస్తరించాలని, ఏవైనా లోపాలు జరిగితే బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని అన్నారు. ప్రజలకు అందే వేగవంతమైన, పారదర్శక సేవలే ఏఐ విజయానికి గీటురాయి అవుతాయని ఆయన పేర్కొన్నారు.

## రేషన్ బియ్యంతో పాటు 6 రకాల సరుకులు

సరఫరా చేస్తున్నారు. కుటుంబ సభ్యుల సంఖ్య ఆధారంగా ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో బియ్యంతోపాటు చక్కెర, గోధుమలు, సబ్బులు సహా పలు నిత్యావసర వస్తువులను రేషన్ దుకాణాల ద్వారా అందించేవారు. ఇప్పుడు అదే తరహాలో పేదలకు నిత్యావసరాల భరోసా కల్పించే ప్రతిపాదన మరోసారి తెరపైకి వచ్చింది. 2023లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బియ్యంతోపాటు ఇతర నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తామని గతంలో ప్రకటించింది. రాష్ట్రంలో ప్రస్తుతం 1.06 కోట్ల ఆహార భద్రత కార్డులు ఉండగా వాటి పరిధిలో సుమారు 3.42 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా దాదాపు 2.18 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఈ భారీ లబ్ధిదారుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని బియ్యంతోపాటు ఇతర వస్తువుల పంపిణీకి ఎంత వ్యయం అవుతుంది ? ఏయే వస్తువులను ఎంత పరిమాణంలో అందించాలి ? పంపిణీని నెలవారీగా చేపట్టాలా, లేక నిర్దిష్ట కాలవ్యవధిలో అందించాలా ? అనే అంశాలపై ప్రభుత్వం లెక్కలు వేస్తున్నట్లు సమాచారం. ప్రతిపాదిత పథకం అమలుకు అవసరమైన నిత్యావసర వస్తువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయా ? లేకుంటే వాటిని ఎలా సేకరించాలి ? కొనుగోళ్లకు ఎంత బడ్జెట్ కేటాయించాలి ? వంటి అంశాలు కూడా కీలకంగా మారనున్నాయి. బియ్యంతోపాటు ఆరు రకాల నిత్యావసరాలను అందించే ఆలోచన ఉన్నప్పటికీ, వాటి పరిమాణం, ధరలు, పంపిణీ విధానంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఈ వివరాల ఆధారంగానే పథకం అమలు ఖర్చును అంచనా వేయనున్నారు. మరోవైపు, ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు తీవ్రతరం కావచ్చన్న ఆందోళనలు, వ్యవసాయంపై వాటి ప్రభావం పేద కుటుంబాల జీవన వ్యయాన్ని మరింత పెంచే ప్రమాదం ఉన్నాయి. యాసంగి సీజన్‌లో పంటల సాగు పరిస్థితులను కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. సాగు పరిస్థితులపై మరో రెండు నెలలు వేచి చూసిన తర్వాత నిత్యావసరాల పంపిణీపై ముందడుగు వేయాలనే ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే సంక్రాంతి నాటికి పథకాన్ని ప్రారంభించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. పథకం అమలులోకి వస్తే మార్కెట్‌లో ధరలు పెరిగిన సమయంలో పేద కుటుంబాలకు కొంత ఉపశమనం లభించడంతోపాటు ఆహార భద్రత బలోపేతం కావచ్చని భావిస్తున్నారు. అయితే పథకం ఖరారు, అమలు తేదీపై ప్రభుత్వం అధికారిక ప్రకటన వెలువరించాల్సి ఉంది.

# తెలంగాణలో ఐఏఎస్ అధికారుల బదిలీలు




ఇక రెవెన్యూ (దేవాదాయ) శాఖకు శైలజ రామయ్యర్‌ను, క్రీడలు మరియు వారసత్వ శాఖకు ఎ. వాణి ప్రసాద్‌ను బదిలీ చేశారు. రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా శాఖ కార్యదర్శిగా కె. ఇలంబర్తి, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శిగా ముషారఫ్ అలీ ఫరూఖీ నియమితులయ్యారు. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల అదనపు బాధ్యతలను సర్ఫరాజ్ అహ్మద్‌కు కేటాయించారు. మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ బాధ్యతలను శ్రుతి ఓఝాకు అప్పగించగా, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా డాక్టర్ సంగీత సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించనున్నారు. టీజీఎస్పీడీసీఎల్, టీజీరెడ్కో బాధ్యతలను జితేష్ వి. పాటిల్‌కు కేటాయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ ఉత్తర్వులు జారీ చేశారు.

# అర్నాబ్ తుఫాన్ బీభత్సం

**- వరద ఉద్ధృతికి రెండు చోట్ల రహదారులు, వంతెనలు ధ్వంసం**
**- సుమారు 20 గ్రామాలకు నిలిచిన రాకపోకలు..**
**- విద్యుత్తు, తాగునీటికి ఇబ్బందులు**

అర్నాబ్ తుఫాన్ తీరం దాటకముందే భోగాపురం మండలంలోని పలు గ్రామాలను అతలాకుతలం చేసింది. మంగళవారం తెల్లవారుజాము నుంచి బుధవారం ఉదయం వరకు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. పలుచోట్ల చెట్లు విరిగి నేలకొరిగాయి. చెరువులు నిండిపోయి నీరు పొంగిపొర్లుతోంది. విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వరద ఉద్ధృతికి కొట్టుకుపోయిన కల్వర్ట్, వంతెనఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం వైపు నుంచి భారీగా వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో సవరవిల్లి నుంచి కౌలవాడ వెళ్లే మార్గంలో జమ్మయ్యపేట సమీపంలోని కల్వర్టు వరద ఉద్ధృతికి కొట్టుకుపోయింది. అదేవిధంగా సవరవిల్లి నుంచి రావాడ మీదుగా భీమిలి మండలంలోని అన్నవరం గ్రామానికి వెళ్లే రహదారిలో జీరు పేట సమీపంలోని వంతెన కూడా వరదనీటికి దెబ్బతింది.ఈ రెండు మార్గాల్లో రాకపోకలు నిలిచిపోవడంతో సుమారు 20 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. అత్యవసర పనులపై వెళ్లాల్సిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## స్వామి వారి ఆలయ అభివృద్ధి కి విరాళాలు

**- శ్రీ లక్ష్మి నరసింహ ఈరన్న స్వామి వార్ల దేవస్థానం ఉరుకుంద.**

**కౌతాళం** : మండల పరిధిలో ఉరుకుందా పుణ్య క్షేత్రం లో స్వామి వారి ఆలయ అభివృద్ధి కి విజయనగర జిల్లా హోస్పేట్ వాస్తవ్యులు రంగన్న గౌడ్ స్వామివారికి ? 10,00,000/- ( పది లక్షలు ) రూపాయలు విరాళంగా చెల్లించి ఉన్నారు..వారికి దేవస్థానం వారు శ్రీ స్వామివారి శేష వస్త్రములు లడ్డు ప్రసాదములు మరియు బాండ్ పేపర్ అందజేసి ప్రత్యేక దర్శనం కల్పించబడినది.ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు వెంకటేశ్వరరావు మరియు ప్రధాన అర్చకులు శ్జే ఈరప్ప స్వామి మరియు దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల పటిష్ఠ భద్రత.

**- ఎస్పీ సుబ్బారాయుడు**



**తిరుపతి** స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లాలో పటిష్ఠ భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సుబ్బారాయుడు తెలిపారు.పోలీస్,రెవెన్యూ శాఖల సమన్వయంతో పనిచేయాలని, ఓటర్లకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ లు నిర్వహిసున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద వంద నుండి రుణాల మీటర్ల పరిధిలో నియంత్ర చర్యలు చేపడతామన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల జరిగే ఐదు ప్రాంతాల్లో ఏపీఎస్పీ బలగా లను మోహరిస్తామన్నారు.

# బీఆర్ఎస్ నేతల ఆరెస్టు

**హైదరాబాద్** మూసీ సుందరీకరణపై ప్రజాభిప్రాయ సేకరణలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మూసీ సుందరీకరణపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, డాక్టర్ కురువ విజయ్ కుమార్, తొట్ల స్వామి యాదవ్‌తో పాటు వందలాది మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసేందుకు వెళ్లినప్పుడు వారిని అరెస్టు చేయించడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ మొండి వైఖరికి నిదర్శనమని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. ప్రజాపాలన అని చెప్పుకుంటూ ప్రజల అభిప్రాయాలను వినకుండా అరెస్టులకు నిరంకుశ కాంగ్రెస్ సర్కార్ పాల్పడుతుందని అన్నారు. మూసీ సుందరీకరణ పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే తన మొండి వైఖరిని మార్చుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ తరఫున పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు

## బైక్ దొంగల ముఠా పట్టివేత.. ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**చందానగర్** అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగల ముఠాను చందానగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఐదుగురు నిందితులు, దొంగిలించిన ఐదు ద్విచక్ర వాహనాలు, 11 నకిలీ నంబర్ ప్లేట్లు, తాళాలు తెరిచేందుకు ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసిపి శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 27, 28 తేదీల మధ్య రాత్రి లింగంపల్లి రైల్వే స్టేషన్ ఆరో నంబర్ ప్లాట్‌ఫామ్ సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులు బైక్‌ను వదిలి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి పట్టుకుని విచారించగా, రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 350 బైక్‌ను దొంగిలించినట్లు వెల్లడైంది. మరింత లోతుగా విచారించగా.. నిందితులు మరో ముగ్గురితో కలిసి ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు.అదుపులోకి తీసుకున్న వారిలో రాజమండ్రికి చెందిన గడ్డం ప్రవీణ్ (21), బురిడి గోపీచంద్ (20), చోడవరపు దినేశ్ కుమార్ (22), గీసాల షణ్ముఖ సత్యసాయి (21), సీరపు దినేశ్ కుమార్ (22)లు ఉన్నారు. డిసెంబర్ 2025 నుంచి సైబరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో బైక్‌లను దొంగిలించి, నకిలీ నంబర్ ప్లేట్లు అమర్చి రాజమండ్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. వీరి నుంచి మూడు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లు, ఒక కేటీఎం డ్యూక్ సహా మొత్తం ఐదు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఇతర దొంగతనాలు, మిగిలిన వాహనాల ఆచూకీపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి, ప్రభుత్వానికి జగన్ కీలక సూచనలు



**తాడేపల్లి** ఆర్నాబ్ తుపాను ఆంధ్రప్రదేశ్ తీరాన్ని తాకిన నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు, ప్రభుత్వానికి కీలక సూచనలు చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ప్రాణనష్టాన్ని నివారించడానికే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని జగన్ సూచించారు. బాధితుల కోసం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, వారికి ఆహారం, తాగునీరు, మందులతో పాటు అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు, అనారోగ్య సమస్యలతో ఉన్న వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో రైతులకు అండగా నిలవాలని, వారికి పెండింగ్‌లో ఉన్న ఇన్పుట్ సబ్సిడీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైఎస్సార్సీపీ శ్రేణులు తక్షణమే సహాయక, పునరావాస కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ప్రజలకు అండగా నిలవాలని జగన్ పిలుపునిచ్చారు. మరోవైపు, ఆర్నాబ్ తుపాను గంటకు 135 కిలోమీటర్ల వేగంతో కూడిన గాలులతో తీరం దాటింది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలు, ఈదురు గాలుల ధాటికి పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తుపాను ప్రభావంతో 100కు పైగా రైళ్లు రద్దు కాగా, భోగాపురం విమానాశ్రయానికి చెందిన 28 సర్వీసులతో పాటు, గన్నవరం విమానాశ్రయం నుంచి నడవాల్సిన అన్ని విమానాలను రద్దు చేశారు.

# తుఫాన్ బీభత్సంలోనూ.. ప్రజల మధ్యలోనే

## ఈదురుగాలులు, వర్షంలో మోటార్‌సైకిల్‌పై మంత్రి నిమ్మల పర్యటన







పాలకొల్లు (ప్రశ్న న్యూస్) ఆర్నబ్ తుఫాన్ ప్రభావంతో ఈదురుగాలులు, భారీ వర్షాలు కురుస్తున్నా.. ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెల్లవారుజాము నుంచే క్షేత్రస్థాయిలో పర్యటించారు. పాలకొల్లు పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మోటార్‌సైకిల్‌పై తిరుగుతూ తుఫాన్ బీభత్సాన్ని స్వయంగా పరిశీలించారు. ఇళ్లకు వెళ్లి ప్రజలను పలకరించి ధైర్యం చెప్పారు. రహదారులపై కూలిన భారీ వృక్షాలు, నేలకొరిగిన విద్యుత్తు స్తంభాల తొలగింపు పనులను పర్యవేక్షించడంతో పాటు, కొన్ని ప్రాంతాల్లో సహాయక చర్యల్లో స్వయంగా పాల్గొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

### కూలిన చెట్ల తొలగింపులోనూ..

పాలకొల్లు మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ప్రధాన రహదారిపై భారీ వృక్షం కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో మంత్రి నిమ్మల మున్సిపల్, విద్యుత్తు శాఖ సిబ్బందితో కలిసి చెట్టును తొలగించే పనులను పర్యవేక్షించారు. పట్టణంలోని ఇతర ప్రాంతాల్లోనూ పర్యటించి రహదారులపై పడిన చెట్లు, విద్యుత్తు స్తంభాలను తక్షణమే తొలగించి రవాణా వ్యవస్థను పునరుద్ధరించాలని సూచించారు. తుఫాన్ తగ్గే వరకు సహాయక బృందాలు నిరంతరం అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు కూడా అధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యల్లో స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ రహదారుల పునరుద్ధరణ, విద్యుత్తు సరఫరా, తాగునీరు, పంట నష్టం అంచనాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచించారు.

# తీరం దాటడం అంటే ఏమిటి?

ఆర్నాబ్ తుపాను తీరం దాటుతోంది. అది అడుగుతీసి అడుగువేసినట్టు ఒక్క క్షణంలో జరిగేది కాదు. సముద్రంలో పుట్టిన ఒక మహా గాలి చక్రం, నెమ్మదిగా నడుచుకుంటూ భూమి మీదికి రావడాన్నే తీరం దాటడం అంటారు.తుపాను అనేది వందల కిలోమీటర్ల మేర విస్తరించిన ఒక భారీ మేఘాల గుంపు. దాని సరిగ్గా మధ్యలో ఒక ఖాళీ ప్రదేశం ఉంటుంది. శాస్త్రవేత్తలు దాన్ని తుపాను కన్ను అంటారు. తుపాను మొత్తం సముద్రంలో ఉన్నప్పుడు ఎవరికీ పెద్దగా ముప్పు ఉండదు. ఎప్పుడైతే ఆ మధ్యలోని కన్ను సముద్రపు నీటిని వదిలి, నేల మీదకు అడుగు పెడుతుందో, సరిగ్గా దాన్నే తీరం దాటడం / ల్యాండ్‌ఫాల్ అంటారు.

**బొంగరం ఆటతో సులువైన పోలిక** గిరగిరా తిరిగే బొంగరాన్ని నేల మీద వదులుతాం కదా. ఆ బొంగరం ఒకేచోట తిరుగుతూనే, మెల్లగా పక్కకు జరుగుతుంది. తుపాను కూడా ఆకాశంలో తిరిగే ఒక పెద్ద రాక్షస బొంగరం లాంటిదే. సముద్రపు నీటి మీద ఉన్నంత సేపు దానికి నీటి ఆవిరి అనే బలం దొరుకుతుంది. ఆ బలంతో అది మరింత వేగంగా తిరుగుతుంది. అలా తిరుగుతూ తిరుగుతూ నేల సరిహద్దును తాకి, భూమి మీదికి అడుగుపెడుతుంది.

**బ్యాటరీ బొమ్మ కారు ఉదాహరణ** తుపానును ఒక రిమోట్ కంట్రోల్ బొమ్మ కారు అనుకుందాం. సముద్రం అనేది ఆ కారుకు కరెంటు ఇచ్చే ఛార్జర్ లాంటిది. సముద్రంలో ఉన్నంత సేపు దానికి నిరంతరం శక్తి అందుతూనే ఉంటుంది. అందుకే అది మహా వేగంగా పరుగులు తీస్తుంది. ఎప్పుడైతే ఆ కారు సముద్రం దాటి నేల మీదికి వస్తుందో, అప్పుడు ఛార్జర్ వైర్ ఊడిపోతుంది. కొత్తగా శక్తి అందడం ఆగిపోతుంది. అయితే అప్పటికే దానిలో నిండి ఉన్న పవర్ అంతా ఆ చుట్టుపక్కల నేల మీద ఒకేసారి ఖర్చు చేస్తుంది. అందుకే తీరం దాటే సమయంలో గంటకు వంద కిలోమీటర్ల పైగా వేగంతో పెనుగాలులు వీస్తాయి, భారీ వర్షాలు కురుస్తాయి.తుపాను కన్ను చేసే పెద్ద మాయతీరం దాటే సమయంలో ఒక విచిత్రం జరుగుతుంది. దీనిలో మూడు అంచెలు ఉంటాయి. మొదట తుపాను ముందు భాగం నేలను తాకుతుంది. భయంకరమైన ఈదురుగాలులు వీస్తాయి, కుండపోత వర్షం పడుతుంది.ఆ తర్వాత తుపాను మధ్య భాగం, అంటే కన్ను నేల మీదికి వస్తుంది. ఆ సమయంలో ఉన్నట్టుండి వర్షం ఆగిపోతుంది. ఆకాశం నిర్మలంగా మారుతుంది. గాలి అస్సలు వీచదు. తుపాను వెళ్లిపోయింది అనుకుని జనం బయటకు వచ్చే ప్రమాదం ఉంది.కానీ అసలైన ట్విస్ట్ అక్కడే ఉంది. కాసేపటికే తుపాను వెనుక భాగం ఊరి మీదికి వస్తుంది. ఈసారి గాలి అంతకుముందు వీచిన వైపు కాకుండా, దానికి పూర్తి ఎదురు దిశ నుంచి అంతకంటే ఎక్కువ వేగంతో విరుచుకుపడుతుంది.

**నేల మీదికి వచ్చాక ఏమవుతుంది?** తీరం దాటడానికి సాధారణంగా మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుంది. నేల మీదకు వచ్చాక తుపానుకు ఆహారమైన సముద్రపు తేమ అందదు. ఊళ్లు, చెట్లు, కొండలు దానికి అడ్డంకులుగా నిలుస్తాయి. దాంతో ఆహారం అందని మనిషిలాగా తుపాను క్రమంగా నీరసించిపోతుంది. గంటలు గడిచేకొద్దీ బలహీనపడి, సాధారణ వర్షంగా మారి కనుమరుగైపోతుంది.

# కాలేజీ ఫీజులు కడితేనే సెమిస్టర్ పరీక్ష ఫీజుల స్వీకరణ.?

## స్కాలర్‌షిప్ ఆలస్యం.. విద్యార్థులకు శాపం
## స్కాలర్‌షిప్ డబ్బులు రాక విద్యార్థుల ఇబ్బందులు
## ఆలస్య రుసుముల భారం కూడా వారిపైనేనా.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ స్కాలర్‌షిప్ నిధులు విడుదలైనా తమ చేతికి అందకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు తీవ్ర పడుతుంటే, మరోవైపు కళాశాల యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు వారిని మరింత ఆందోళనకు గురిచేస్తోందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బాలానగర్ పరిధిలోని చింతల్ న్యూ సిద్ధార్థ డిగ్రీ కళాశాల (ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ కళాశాల)లో డిగ్రీ చివరి సంవత్సరం ఐదో సెమిస్టర్ పరీక్ష ఫీజుల స్వీకరణ విషయంలో ఈ సమస్య ఎదురవుతోందని విద్యార్థులు వాపోతున్నారు.తమ కళాశాల ఫీజులు పూర్తిగా చెల్లిస్తేనే పరీక్ష ఫీజులు స్వీకరిస్తామని, లేనిపక్షంలో తీసుకోమని యాజమాన్యం బెదిరిస్తుందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. స్కాలర్‌షిప్‌పై ఆధారపడిన విద్యార్థులు ఫీజులు చెల్లించలేకపోతున్నారని, తమ స్కాలర్‌షిప్ మొత్తం మంజూరైనట్లు తెలిసినా ఇప్పటివరకు తమ ఖాతాలకు చేరలేదని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సొమ్ము చేతికి అందని పరిస్థితుల్లో కళాశాల ఫీజులు ఎలా చెల్లించాలని ప్రశ్నిస్తున్నారు.

### ప్రతి సెమిస్టర్‌లోనూ ఇదే సమస్య..

ఇది ఒక్క ఐదో సెమిస్టర్‌కే పరిమితం కాలేదని, గత సెమిస్టర్లలోనూ పరీక్ష ఫీజులు చెల్లించే సమయంలో కాలేజీ యజమాన్యంతో ఇదే తరహా సమస్య ఎదురైనట్లు విద్యార్థులు పేర్కొంటున్నారు. ముందుగా కళాశాల ఫీజు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని, అలా చెల్లించలేని విద్యార్థులు పరీక్ష ఫీజుల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తున్నారు.అంతేకాకుండా, ఫీజులు చెల్లించడంలో జాప్యం జరిగితే ఆ తర్వాత ఆలస్య రుసుము (లేట్ ఫైన్) పేరుతో అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. స్కాలర్‌షిప్ నిధుల జాప్యానికి విద్యార్థులు బాధ్యులు కాకపోయినా, ఆ కారణంగా ఏర్పడుతున్న ఆర్థిక భారాన్ని వారే భరించాల్సి వస్తోందని, దీనిపై ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు సైతం చర్యలు తీసుకోకుండా మౌనం వహించడం విస్మయాన్ని కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పరీక్షలకు దూరమయ్యే పరిస్థితి వస్తుందా.?

డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఐదో సెమిస్టర్ పరీక్షలు కీలకమైనవి. పరీక్ష ఫీజుల చెల్లింపులో జాప్యం జరిగితే పరీక్షలకు హాజరయ్యే అవకాశం కోల్పోతామేమోనని విద్యార్థులు తీవ్రమైన మానసిక ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే స్కాలర్‌షిప్ నిధుల కోసం ఎదురుచూస్తున్న తమపై కళాశాల ఫీజుల భారం, ఆలస్య రుసుముల భారం మోపడం ఎంతవరకు సమంజసమని, అసలు విద్యాశాఖ నిబంధనలలో ఫీజులు అడ్డం పెట్టుకుని విద్యార్థుల పరీక్ష ఫీజులను తీసుకోకపోవడం ఉందా అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.విద్యార్థుల విద్యా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్ష ఫీజులు స్వీకరించే విషయంలో ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు, కళాశాల యాజమాన్యం మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని వారు కోరుతున్నారు. స్కాలర్‌షిప్ నిధులు అందని కారణంగా పరీక్షలకు దూరమయ్యే పరిస్థితి కల్పించకుండా సంబంధిత అధికారులు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.




### ఓయూ అధికారులు స్పందించే నా.?

ఈ వ్యవహారంపై ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు, ఉన్నత విద్యాశాఖ అధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని విద్యార్థులు కోరుతున్నారు.

స్కాలర్‌షిప్ నిధుల విడుదల, విద్యార్థుల ఖాతాల్లో జమయ్యే ప్రక్రియపై స్పష్టత ఇవ్వడంతో పాటు, పరీక్ష ఫీజుల స్వీకరణలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తు ఫీజుల వివాదంలో చిక్కకుండా చూడాలని, స్కాలర్‌షిప్ జాప్యాన్ని సాకుగా చూపి కాలేజీ యజమాన్యాలు పరీక్షలకు దూరమయ్యే పరిస్థితి రాకుండా ఉన్నత అధికారులు తక్షణమే స్పందించాలని విద్యార్థులు కోరుతున్నారు.

# పంట నష్టాన్ని తగ్గించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి

**అమరావతి :** ఆర్నాబ్ తుఫాను నేపథ్యంలో పంట నష్టాన్ని సాధ్యమైనంత వరకు నివారించడంతో పాటు రైతులకు అండగా నిలిచేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. బుధవారం వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఉన్నతాధికారులు, జిల్లా స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పంటల సంరక్షణ, పునరుద్ధరణ, సహాయక చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామస్థాయి వ్యవసాయ సహాయకుడి నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటలు, ఇప్పటికే కోసిన పంటలు, ధాన్యం నిల్వలు దెబ్బతినకుండా రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించిన వెంటనే అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులతో నేరుగా మాట్లాడాలని సూచించారు. నీటమునిగిన పంటలను కాపాడేందుకు పొలాల్లో నిలిచిన నీటిని తొలగించడం, పంటల పునరుద్ధరణకు అవసరమైన చర్యలు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.పంట నష్టాన్ని గ్రామాలవారీగా, పంటలవారీగా, రైతులవారీగా అంచనా వేసి ప్రాథమిక నివేదికలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి పంపించాలని, అనంతరం సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రతి రైతు సమస్యపై సానుకూలంగా స్పందించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నష్టపోయిన రైతుల వివరాలను త్వరితగతిన సేకరించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి రైతుకూ సకాలంలో సహాయం అందేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. తుఫాను సమయంలో రైతులకు భరోసా కల్పించడమే అధికారుల ప్రథమ కర్తవ్యమని, క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యానికి తావులేకుండా సమష్టిగా పనిచేయాలని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, వ్యవసాయ శాఖ కమిషనర్ మంజీర్ జిలానీ, ఉద్యానవన శాఖ కమిషనర్ శ్రీనివాసులుతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# తీరం దాటిన ఆర్నబ్ తుపాను

**అమరావతి** చివరికి... ఎన్నో ఉత్కంఠల తర్వాత తీరాన్ని తాకింది పెను తుపాను ఆర్నబ్. రాత్రి 2 గంటల నుంచి ఉదయం 8 గంటల మధ్య .యానాంకు నైరుతిగా నరసాపురం దగ్గర తీరం దాటినట్టుగా అధికారులు ప్రకటించారు. తీరం దాటుతూనే ఆర్నబ్ తీవ్ర తుపానుగా బలహీనపడింది. అయినప్పటికీ ప్రజలు ఇంకా అప్రమత్తంగా ఉండాల్సిందేనని అధికారులు హెచ్చరించారు. గాలులు తగ్గినా వర్షప్రభావం ఇంకా తీవ్రంగా ఉంటుంది. నేడు పలు జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ స్పష్టం చేశారు

# తుపాను విపత్తులో గర్భిణి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

**అల్లూరి సీతారామరాజు :** అర్నాబ్ తుపాను సృష్టించిన బీభత్సంలో ఓ గర్భిణిని కాపాడేందుకు 108 అంబులెన్స్ సిబ్బంది ప్రాణాలకు తెగించి పోరాడారు. అంకితభావంతో పనిచేసి సమయస్ఫూర్తితో ఆమెను సురక్షితంగా ఆసుపత్రికి చేర్చారు. వివరాల్లోకి వెళ్తే.. వై. రామవరం ప్రాంతానికి చెందిన ఒక ఆరు నెలల గర్భిణికి ఉమ్మనీరు లీక్ అవ్వడంతో పరిస్థితి విషమంగా మారింది. దీంతో సమాచారం అందుకున్న వై. రామవరం 108 అంబులెన్స్ సిబ్బంది ఆమెను ఆసుపత్రికి తరలించేందుకు బయలుదేరారు. అయితే, తుపాను ప్రభావం వల్ల రాయపల్లి గ్రామం వద్ద ఒక భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా విరిగిపడటంతో అంబులెన్స్ ముందుకు వెళ్లే పరిస్థితి లేకపోయింది.సమయం మించి పోతుండటంతో వై. రామవరం 108 సిబ్బంది తక్షణమే అడ్డతీగల 108 అంబులెన్స్ బృందాన్ని సంప్రదించి సహాయం కోరారు.

సమాచారం అందిన వెంటనే అడ్డతీగల సిబ్బంది రోడ్డుకు అవతలి వైపునకు అంబులెన్స్‌తో చేరుకున్నారు. ఎంతో సమన్వయంతో, అత్యంత జాగ్రత్తగా గర్భిణిని 'స్పైన్ బోర్డ్' (ాజూతినివ ఃనీజీతీట) సహాయంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టుపై నుండి అవతలి వైపు ఉన్న అంబులెన్స్‌లోకి మార్చారు. అనంతరం ఆమెను సురక్షితంగా, సకాలంలో ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు.ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో సమయస్ఫూర్తితో పాటు అంకితభావం కనబరిచిన వై. రామవరం ఇఓటి రాజమణి, పైలట్ రవితేజ, అలాగే అడ్డతీగల పైలట్ బి. శ్రీనివాస్, ఇఓటి అశోక్ కుమార్ ను స్థానికులు ఉన్నతాధికారులు అభినందించారు. ఆపత్కాలంలో అండగా నిలిచి గర్భిణి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది సేవలపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# తుపాను దెబ్బకు తీరంలో విలవిల

## పాల్మన్‌పేట, కోర్లయపేట మత్స్యకారులకు భారీ నష్టం
## తీర ప్రాంతాల్లో హోంమంత్రి అనిత సుడిగాలి పర్యటన..
## నష్టాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం

రాయవరం/పాయకరావుపేట( ప్రశ్న న్యూస్) తుపాను ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. ఎగసిపడుతున్న అలలు మత్స్యకారుల జీవనాధారంపై పంజా విసిరాయి. పాయకరావుపేట మండలంలోని పాల్మన్‌పేట, కోర్లయపేట తీర గ్రామాల్లో మత్స్యకారులకు తీవ్ర నష్టం వాటిల్లింది. రెండు గ్రామాలకు చెందిన 16 తెప్పలు సముద్రంలో కొట్టుకుపోగా.. మరో 19 తెప్పలు ధ్వంసమయ్యాయి. దీంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత బుధవారం సుడిగాలి పర్యటన చేపట్టి పరిస్థితులను సమీక్షించారు. బాధిత మత్స్యకారులతో మాట్లాడి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. నష్టాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక అందించాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు.

### క్షేత్రస్థాయిలో పరిస్థితుల పరిశీలన..

అర్నబ్ తుపాను నేపథ్యంలో పాయకరావుపేట నియోజకవర్గంలోని ప్రభావిత ప్రాంతాల్లో హోంమంత్రి అనిత పర్యటించారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి ఎస్.రాయవరం మండలంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. తుపాను ప్రభావంతో నెలకొన్న పరిస్థితులు, అధికారులు చేపట్టిన ముందస్తు చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు వరహా నదిలోని పెనుగొల్లు గ్రోయిన్‌ను పరిశీలించిన మంత్రి.. అనంతరం రాయవరం నుంచి లింగరాజుపాలెం వెళ్లే వంతెన వద్ద పరిస్థితులను సమీక్షించారు. తుపాను కారణంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. రాయవరంలో స్థానికులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు.

### మత్స్యకారుల గోడు.. మంత్రి ఆరా..

పాయకరావుపేట మండలంలోని పాల్మన్‌పేట, కోర్లయపేట తీర ప్రాంతాల్లో తుపాను కారణంగా జరిగిన నష్టాన్ని హోంమంత్రి అనిత పరిశీలించారు. సముద్రంలో తెప్పలు కొట్టుకుపోవడం, మరికొన్ని ధ్వంసం కావడంతో జీవనోపాధికి ఎదురైన ఇబ్బందులను మత్స్యకారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్న ఆమె.. మత్స్యశాఖ అధికారులతో మాట్లాడి నష్టం వివరాలపై ఆరా తీశారు. పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలోని ఏయే గ్రామాల్లో ఎన్ని తెప్పలు గల్లంతయ్యాయి?

ఎన్ని దెబ్బతిన్నాయి? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల వారీగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, నష్టాల వివరాలతో పూర్తి నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు.

**బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది..**తుపాను కారణంగా నష్టపోయిన మత్స్యకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హోంమంత్రి అనిత భరోసా ఇచ్చారు. బాధితుల సమస్యలను అధికారులు ప్రాధాన్యంతో పరిశీలించాలని సూచించారు. తీర ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



### పునరావాస కేంద్రాల్లో మెరుగైన వసతులు..

తుపాను నేపథ్యంలో పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన వసతులు కల్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. తీర ప్రాంతాలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అధికారులు జారీ చేసే సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.తుపాను ప్రభావం పూర్తిగా తగ్గేవరకు ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, అత్యవసర పరిస్థితుల్లో అధికారుల సహాయం తీసుకోవాలని సూచించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు.

# కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం

## - ఈదురుగాలులతో పలుచోట్ల విరిగిపడ్డ చెట్లు, హోర్డింగులు

**అమరావతి** కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో పలుచోట్ల చెట్లు, హోర్డింగులు విరిగిపడ్డాయి. అవనిగడ్డ నియోజకవర్గం, కోడూరు మండలంలోని వేణుగోపాలపురం లో రోడ్డు మీద భారీ చెట్లు విరిగిపడ్డాయి. రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురిసిన వానకి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. భయంకరమైన గాలులకు దగ్గరలోనే ఉన్న సముద్రం అల్లకల్లోలంగా మారడంతో ప్రజలందరు భయభ్రాంతులకు గురయ్యారు. రాత్రినుండి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పూర్తిగా అంధకారంలో వేణుగోపాలపురం ఉండిపోయింది.

విద్యుత్ సరఫరా నిలవదనీతో ఒక ప్రక్క ఆక్వారంగం తీవ్ర ఇబ్బందులకు గురవుతుంది.. మరోప్రక్క ఇంటర్నెట్ సేవలు కూడా నిలవదనీతో 1977 తుఫాన్ మాదిరి ఏమైనా వస్తుందా అని ప్రాణ భయంతో రాత్రి నుండి గ్రామ ప్రజలు భయపడ్డారు. గ్రామం నుండి బయటకు వెళ్ళాలి అంటే ఉల్లిపాలెం వైపు లింగన్నకోడు దగ్గర వంతెన విరిగిపోవటం, సాలెంపాలెం వైపు రోడ్డు లేకపోవటం వలన వేణుగోపాలపురం ప్రజలు భయంకరమైన పరిస్థితులలో ఉండిపోయారు.

# తుఫాను బీభత్సం.. పసికందుకు గాయాలు

**కూలిన గోడ.. తొమ్మిది నెలల శిశువుకు తీవ్ర ఆందోళన..**

**కంట్రోల్ రూమ్‌కు ఫోన్..**

**వెంటనే స్పందించిన అధికారులు**

**రహదారిపై వృక్షం తొలగింపు**



పార్వతీపురం మన్యం(ప్రశ్న న్యూస్) తుఫాను ప్రభావంతో పార్వతీపురం మన్యం జిల్లాలో వర్షాలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఒకవైపు ఇంటి పక్క గోడ కూలి తొమ్మిది నెలల పసికందుతోపాటు తల్లిదండ్రులకు గాయాలు కాగా, మరోవైపు భారీ వృక్షం రహదారిపై కూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకాలు ఎదురయ్యాయి. ప్రకృతి ప్రతికూల పరిస్థితుల నడుమ అధికార యంత్రాంగం, అగ్నిమాపక, విద్యుత్ శాఖల సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు.

### గోడ కూలి పసికందుకు గాయాలు..

తుఫాను వేళ ఇంటి పక్క గోడ కూలిన ఘటన కలకలం రేపింది. పాచిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కరివలస సచివాలయానికి చెందిన గుమ్మడిగుడ్డివలస గ్రామంలో బుధవారం ఉదయం సుమారు ఆరు గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. కొర్ర మహేష్, కొర్ర తౌడమ్మ దంపతుల తొమ్మిది నెలల శిశువుకు తలకు స్వల్ప గాయాలయ్యాయి. తల్లిదండ్రులకు కూడా స్వల్ప గాయాలయ్యాయి.ఈ ఘటనపై కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందగానే అధికారులు స్పందించారు. వైద్య ఆరోగ్య శాఖకు సమాచారం చేరవేసి శిశువును సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో విజయనగరంలోని ఘోషా ఆసుపత్రికి తరలించారు. ఆశా కార్యకర్త కూడా శిశువుతో పాటు వెళ్లారు.శిశువు ఆరోగ్యం నిలకడగా: ప్రస్తుతం పసికందు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, శిశువు చురుగ్గా ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఆశా కార్యకర్త, ఏఎన్ఎం ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

### అత్యవసర వేళల్లో కంట్రోల్ రూమ్ కీలకం..

తుఫాను వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల నుంచి అందే సమాచారాన్ని సంబంధిత శాఖలకు చేరవేసి సత్వర చర్యలు తీసుకునేందుకు కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ కీలకంగా వ్యవహరిస్తోంది. గుమ్మడిగుడ్డివలసలో శిశువు గాయపడిన ఘటనలోనూ సమాచారం అందగానే వైద్య సహాయం అందేలా అధికారులు చర్యలు చేపట్టారు.వర్షాలు, ఈదురుగాలుల సమయంలో పాత గోడలు, చెట్లు, విద్యుత్ లైన్ల సమీపంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సంబంధిత అధికారులకు సమాచారం అందించడం ద్వారా సకాలంలో సహాయం పొందే అవకాశం ఉంటుంది.

# పలాసలో వైసీపీకి షాక్

**టీడీపీలోకి 20 కుటుంబాలు, ఎమ్మెల్యే సమక్షంలో చేరికలు**

**బిడిమి, కొత్త బిడిమి గ్రామాల నుంచి పసుపు పార్టీలోకి వలసలు**

**కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే గౌతు శిరీష**



పలాస( ప్రశ్న న్యూస్) పలాస నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి కొత్త బలం చేకూరింది. మందస మండలం రాంపురం పంచాయతీ పరిధిలోని బిడిమి, కొత్త బిడిమి గ్రామాలకు చెందిన 20 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. రెండు గ్రామాలకు చెందిన కార్యకర్తలు, వారి కుటుంబాలు టీడీపీలో చేరడంతో రాంపురం పంచాయతీ పరిధిలో పార్టీ బలోపేతానికి దోహదం చేస్తుందని టీడీపీ శ్రేణులు భావిస్తున్నాయి.

### ఎమ్మెల్యే సమక్షంలో చేరికలు..

ఇప్పటివరకు వైఎస్సార్‌సీపీలో కార్యకర్తలుగా పనిచేసిన పలువురు నేతలు, వారి కుటుంబ సభ్యులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష నూతనంగా పార్టీలో చేరిన వారిని ఆత్మీయంగా స్వాగతించారు. బిడిమి, కొత్త బిడిమి గ్రామాలకు చెందిన కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి తెలుగుదేశం కుటుంబంలోకి ఆహ్వానించారు.

### వీరు ముఖ్య కార్యకర్తలు..

పార్టీలో చేరిన వారిలో రత్నాల భీమారావు, జుత్తు గణపతి, బొడ్డు దుర్యోధన, సోర్ర జానారావు, జుత్తు కృష్ణమూర్తి, మంగి పుణేష్, జుత్తు చంద్రయ్య తదితరులు ఉన్నారు. వీరితోపాటు ఆయా గ్రామాలకు చెందిన ఇతర కుటుంబాలు కూడా టీడీపీలో చేరాయి.

### పంచాయతీ పరిధిలో పార్టీ బలోపేతంపై ఆశలు..

ఒకేసారి 20 కుటుంబాలు పార్టీ మారడంతో రాంపురం పంచాయతీ పరిధిలో తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. గ్రామస్థాయిలో పార్టీ విస్తరణకు ఈ చేరికలు దోహదం చేస్తాయని నాయకులు భావిస్తున్నారు. రానున్న రోజుల్లో మరింత మంది ఇతర పార్టీల కార్యకర్తలు టీడీపీలో చేరే అవకాశం ఉందని స్థానిక శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# రైతు కుటుంబం నుంచి రాజకీయ ప్రస్థానం

- కార్యకర్త నుంచి జడ్పీటీసీ బరిలోకి రెంటపల్లి నాగరాజు- వైఎస్సార్ ఆశయాల స్ఫూర్తితో అడుగులు..
- జగన్ నాయకత్వంపై అభిమానం.. - మాజీ మంత్రి జోగి రమేష్ ఆశీస్సులతో రాజకీయ ప్రయాణం..
- గ్రామ సర్పంచిగా మొదలై.. వైసీపీ మండల అధ్యక్షుడిగా ఎదిగి.. - ఇప్పుడు జిల్లా పరిషత్ స్థాయిలో ప్రజాప్రతినిధిగా అడుగులు వేయాలన్న ఆకాంక్ష...

ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్) రాజకీయాల్లో వారసత్వం ఉన్నవారే రాణిస్తారా? ఆర్థికంగా బలమైన కుటుంబాల నుంచి వచ్చినవారికే ప్రజాజీవితంలో అవకాశాలు లభిస్తాయా? సామాన్య కుటుంబంలో పుట్టి, ప్రజల మధ్య ఉంటూ, ఒక సాధారణ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన వ్యక్తి అంచెలంచెలుగా ఎదగలేడా? ఈ ప్రశ్నలకు తన రాజకీయ ప్రయాణాన్ని పరిచయం చేస్తూ ప్రజల ముందుకు వస్తున్నారు రెంటపల్లి నాగరాజు. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆయన.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా మొదలుపెట్టి, గ్రామ సర్పంచిగా, పార్టీ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించి, ప్రస్తుతం జడ్పీటీసీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయికి విస్తరించిన ఆయన రాజకీయ ప్రస్థానం ఇప్పుడు జిల్లా పరిషత్ స్థాయి వైపు సాగుతోంది.

### రైతు కుటుంబం నుంచి రాజకీయాల వైపు..

వ్యవసాయ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన రెంటపల్లి నాగరాజుకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పట్ల ప్రత్యేక అభిమానం ఉందని ఆయన అనుచరులు చెబుతున్నారు. వైఎస్సార్ అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, పేద ప్రజల కోసం చేపట్టిన పథకాలు తనను రాజకీయాల వైపు ఆకర్షించాయని వారు వివరిస్తున్నారు. ఆ అభిమానంతోనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో అనుబంధం పెంచుకుని, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించినట్లు పేర్కొంటున్నారు.సాధారణ కార్యకర్తగా ప్రారంభమైన ప్రస్థానం ఆయనకు గ్రామస్థాయి రాజకీయాల్లో గుర్తింపు తెచ్చిపెట్టిందని మద్దతుదారులు చెబుతున్నారు. రాజకీయాల్లో నిలదొక్కుకోవడానికి ప్రజలతో అనుబంధం, పార్టీ పట్ల విధేయత, క్షేత్రస్థాయిలో నిరంతరం పనిచేయడం అవసరమనే అభిప్రాయంతో నాగరాజు ముందుకు సాగారని వివరిస్తున్నారు.

### కార్యకర్త నుంచి సర్పంచిగా.. ఇదీ ఎదుగుదల..

ఒక పార్టీ జెండా పట్టుకుని కార్యక్రమాల్లో పాల్గొనే కార్యకర్త స్థాయి నుంచి గ్రామానికి ప్రాతినిధ్యం వహించే సర్పంచి స్థాయికి ఎదగడం నాగరాజు రాజకీయ ప్రయాణంలో కీలక ఘట్టంగా చెప్పుకోవచ్చు. గ్రామస్థాయి సమస్యలు, ప్రజల అవసరాలు, స్థానిక అభివృద్ధి అంశాలతో ముడిపడిన సర్పంచి బాధ్యతలు ఆయన రాజకీయ ప్రస్థానానికి మరో మెట్టుగా నిలిచాయి.ఆ తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించే అవకాశం లభించడంతో ఆయన రాజకీయ పరిధి మరింత విస్తరించింది. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ కార్యకలాపాల్లో భాగస్వామిగా కొనసాగడం, నాయకులు, కార్యకర్తలతో సంబంధాలు కొనసాగించడం ఆయన ప్రయాణంలో ప్రస్తావించదగిన అంశాలుగా అనుచరులు పేర్కొంటున్నారు.

కార్యకర్తగా మొదలైన అడుగులు..
సర్పంచిగా ప్రజాప్రతినిధి బాధ్యతలు..
మండల అధ్యక్షుడిగా పార్టీ నిర్వహణ..
ఇప్పుడు జడ్పీటీసీ అభ్యర్థిగా మరో కీలక అవకాశం,ఈ క్రమమే రెంటపల్లి నాగరాజు రాజకీయ ప్రస్థానానికి ప్రధాన గుర్తింపుగా నిలుస్తోంది.

### వైఎస్సార్ అభిమానంతో.. జగన్ నాయకత్వంపై నమ్మకంతో..

దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పట్ల అభిమానంతో రాజకీయాల వైపు ఆకర్షితుడైన నాగరాజు.. అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో తన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ సిద్ధాంతాలు, సంక్షేమ రాజకీయాల పట్ల విశ్వాసంతో పనిచేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని వివరిస్తున్నాయి.
రాజకీయాల్లో నాయకత్వంపై అభిమానం ఒక అంశమైతే, ప్రజలతో సంబంధాలను కొనసాగించడం మరో అంశం. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండటం, స్థానిక సమస్యలపై స్పందించడం వంటి అంశాలే ఒక నాయకుడి రాజకీయ ప్రయాణానికి దిశానిర్దేశం చేస్తాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

### జోగి రమేష్ ఆశీస్సులు.. రాజకీయ ప్రయాణంలో ప్రస్తావన..

మాజీ మంత్రి జోగి రమేష్ ఆశీస్సులు, ప్రోత్సాహం తన రాజకీయ ప్రయాణంలో ముఖ్యమైనవని నాగరాజు మద్దతుదారులు పేర్కొంటున్నారు. పార్టీ నాయకత్వంతో అనుబంధాన్ని కొనసాగిస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలకు అంకితమవడం ద్వారా ఆయన తన రాజకీయ బాధ్యతలను విస్తరించుకున్నారని వారు చెబుతున్నారు.
అయితే రాజకీయాల్లో ఎదుగుదల అనేది ఒక్కరి ప్రోత్సాహంతోనే పూర్తయ్యే ప్రక్రియ కాదు. పార్టీ నిర్మాణంలో పనిచేయడం, ప్రజలతో మమేకం కావడం, స్థానిక సమస్యలపై అవగాహన పెంచుకోవడం, ప్రజాప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తించడం వంటి అనేక అంశాలు నాయకుడి ప్రయాణంలో కీలకంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో నాగరాజు ఇప్పటివరకు నిర్వహించిన బాధ్యతలు, ప్రస్తుత ఎన్నికల్లో ఆయన ముందుంచుతున్న అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

### జడ్పీటీసీ బరిలోకి.. గ్రామాల అభివృద్ధే ప్రధాన అంశంగా..

ఇబ్రహీంపట్నం మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన జడ్పీటీసీ అభ్యర్థిగా రెంటపల్లి నాగరాజు ప్రచారం నిర్వహిస్తున్నారు. కొటికలపూడితో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. తన రాజకీయ ప్రస్థానాన్ని వివరిస్తూ, సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన తనకు ప్రజాసేవ చేసే అవకాశం కల్పించాలని అభ్యర్థిస్తున్నారు.దళిత, నిరుపేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం వంటి అంశాలను తన ప్రచారంలో ప్రస్తావిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, సంక్షేమ కార్యక్రమాల కొనసాగింపునకు తమ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తూ గ్రామాల్లో ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

### సామాజిక న్యాయం.. ప్రజాప్రాతినిధ్యంపై దృష్టి...

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రతిపాదించిన సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువలు




ప్రజాస్వామ్యంలో కీలకమైనవి. గ్రామస్థాయి నుంచి జిల్లా పరిషత్ వరకు ప్రజాప్రతినిధుల పాత్ర కూడా స్థానిక సమస్యలను సంబంధిత వేదికలపై ప్రస్తావించడం, అభివృద్ధి అవసరాలను గుర్తించడం, ప్రజల ఆకాంక్షలను పాలనా వ్యవస్థ దృష్టికి తీసుకెళ్లడంలో ఉంటుంది.
ఈ నేపథ్యంలో జడ్పీటీసీ అభ్యర్థిగా బరిలో నిలిచిన నాగరాజు తనకు అవకాశం లభిస్తే గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన బాధ్యతను ఎదుర్కోనున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్యం, పేదలకు సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలు ప్రజాప్రతినిధుల ముందున్న ముఖ్యమైన బాధ్యతలు.

### రాజకీయ ప్రస్థానానికి ప్రజల తీర్పే కీలకం...

సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన ఒక వ్యక్తి.. పార్టీ కార్యకర్తగా ప్రారంభించి సర్పంచిగా, మండల అధ్యక్షుడిగా ఎదిగి.. ఇప్పుడు జడ్పీటీసీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలవడం రెంటపల్లి నాగరాజు రాజకీయ ప్రయాణంలో మరో మైలురాయి. ఈ ఎదుగుదలను ఆయన అనుచరులు పార్టీ పట్ల విధేయతకు, రాజకీయాల్లో అంచెలంచెలుగా ముందుకు సాగాలనే పట్టుదలకు ఉదాహరణగా పేర్కొంటున్నారు.అయితే, పార్టీ పదవులు, నాయకుల ప్రోత్సాహం, ప్రచారంలో కనిపించే ఉత్సాహం ఒకవైపు ఉంటే.. ఎన్నికల్లో ప్రజల తీర్పు మరోవైపు కీలకం. తాను ఇప్పటివరకు నిర్వహించిన బాధ్యతలు, భవిష్యత్తులో చేపట్టాలనుకుంటున్న కార్యక్రమాలు, ప్రజలతో ఉన్న అనుబంధం ఆధారంగా ఓటర్ల విశ్వాసాన్ని పొందడం నాగరాజు ముందున్న ప్రధాన సవాలు.రైతు కుటుంబం నుంచి రాజకీయాల్లోకి.. కార్యకర్త నుంచి సర్పంచిగా.. మండల అధ్యక్షుడి నుంచి జడ్పీటీసీ అభ్యర్థిగా.. రెంటపల్లి నాగరాజు రాజకీయ ప్రస్థానం ఇబ్రహీంపట్నం మండలంలో చర్చనీయాంశంగా నిలుస్తోంది. గ్రామస్థాయి రాజకీయాల నుంచి జిల్లా పరిషత్ స్థాయికి తన ప్రస్థానాన్ని విస్తరించాలనే ఆకాంక్షతో ఆయన ముందుకు సాగుతున్నారు. ఈ ప్రయాణంలో ప్రజలు ఎలాంటి తీర్పు ఇస్తారన్నది ఎన్నికల ఫలితాలే నిర్ణయించనున్నాయి.

# తుపాను ముప్పు.. గుంటూరులో హైఅలర్ట్

**వర్షపు నీరు నిలవకుండా ముందస్తు చర్యలు**

**సమస్యలుంటే జీఎంసీ కాల్‌సెంటర్‌కు ఫోన్ చేయండి:**

**కమిషనర్ మయూర్ అశోక్**



గుంటూరు( ప్రశ్న న్యూస్ ) అర్నబ్ తుపాను ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో గుంటూరు నగరపాలక సంస్థ అప్రమత్తమైంది. నగరంలో ఎక్కడా వర్షపు నీరు నిలిచిపోకుండా, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టింది. లోతట్టు ప్రాంతాలు, ప్రధాన డ్రెయిన్లు, నాలాలపై ప్రత్యేక దృష్టి సారించింది. పారిశుధ్య, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. తుపాను పరిస్థితుల నేపథ్యంలో బుధవారం నగరంలోని పలు సమస్యాత్మక ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు.

**లోతట్టు ప్రాంతాలపై నిఘా..**

నగరంలో వర్షపు నీరు అధికంగా నిలిచే చుట్టగుంట మురికిపేట, పీకల వాగు, కంకరగుంట ఆర్వోబీ, టీజేపీఎస్ కళాశాల ఎదురుభాగం, ఐటీసీ రోడ్డు, జేకేసీ కళాశాల రోడ్డు, పట్టాభిపురం ప్రధాన రహదారి, అమరావతి రోడ్డు, మూడు వంతెనలు, రామిరెడ్డితోట, గుంటూరువారితోట, పాత గుంటూరు, నందివెలుగు రోడ్డు తదితర ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు. వర్షాలు కురిస్తే ఆయా ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశాలు, డ్రెయినేజీ వ్యవస్థ పనితీరుపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

**అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండాలి**

వార్డు శానిటేషన్ కార్యదర్శులు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలో క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగాల మధ్య సమన్వయం ఉండాలని, వర్షపు నీరు నిలిచే ప్రాంతాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రస్తుత వర్షాల కారణంగా ఎదురవుతున్న సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలతో సరిపెట్టకుండా, వాటి శాశ్వత పరిష్కారానికి వార్డుల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

**సమస్యలుంటే ఫోన్ చేయండి**

తుపాను నేపథ్యంలో నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జీఎంసీ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని కమిషనర్ మయూర్ అశోక్ తెలిపారు. ప్రజలు వర్షాలు, డ్రెయినేజీ సమస్యలు లేదా ఇతర అత్యవసర ఇబ్బందులు ఎదుర్కొంటే నగరపాలక సంస్థ కాల్‌సెంటర్ 0863 2345103 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ, తుపాను ప్రభావం తగ్గే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు.

# ఏసీబీ అదుపులో బంజారాహిల్స్ ఎస్ఐ విజయ్

**-రూ.10 లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణ**

**- రూ.లక్ష తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టివేత**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ పోలీసు శాఖలో అవినీతి ఆరోపణలు తీవ్ర కలకలం రేపాయి. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు చర్యలు చేపట్టారు. ఓ వివాదానికి సంబంధించిన వ్యవహారంలో బాధితుడి నుంచి రూ.10 లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు ఎస్సై విజయ్‌పై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇందులో భాగంగా మొదటి విడతగా రూ.లక్ష తీసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఫిర్యాదు అందుకున్న ఏసీబీ అధికారులు విచారణ చేపట్టి ఎస్సై విజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఓ కేసు, వివాదానికి సంబంధించి ఎస్సై విజయ్ లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు అందింది. బాధితుడి నుంచి మొత్తం రూ.10 లక్షలు కోరినట్లు ఆరోపణలు ఉన్నాయి. మొదటి విడతగా రూ.లక్ష చెల్లించే సమయంలో ఏసీబీ అధికారులు ఎస్సై విజయ్‌ని వల వేసి పట్టుకున్నారు. అయితే ఈ ఘటనలో బాధితుడు సమర్పించిన ఆడియో, వీడియో ఆధారాల పరిశీలన తర్వాత ఏసీబీ అధికారులు ఎస్సై విజయ్‌పై చర్యలు తీసుకున్నట్లు కొన్ని కథనాలు వెల్లడించాయి. అయితే దీనిపై మరిన్ని వివరాలు అధికారిక ప్రకటనతో స్పష్టత రావాల్సి ఉంది. బంజారాహిల్స్ పరిధిలోని ఓ ఇంటి యజమాని, అద్దెకు ఉంటున్న వారి మధ్య తలెత్తిన వివాదంలో ఎస్సై విజయ్ ఒక వర్గానికి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఒక వర్గానికి చెందిన వ్యక్తులను అరెస్టు చేయడం, వారు జైలు నుంచి విడుదలైన తర్వాత లంచం ఆరోపణలు తెరపైకి రావడం వంటి అంశాలు దర్యాప్తులో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ కేసుకు సంబంధించి బాధితులు తమ వద్ద ఉన్నట్లు పేర్కొన్న వీడియో, ఇతర ఆధారాలను ఏసీబీ అధికారులకు అందజేసి ఎస్సై విజయ్‌పై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఫిర్యాదు అందుకున్న ఏసీబీ అధికారులు ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను పరిశీలించినట్లు తెలుస్తోంది. అనంతరం ఎస్సై విజయ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో అధికారులు సోదాలు నిర్వహించి కేసుకు సంబంధించిన రికార్డులు, ఇతర వివరాలను పరిశీలించారు. అయితే ఈ వ్యవహారంలో కేవలం ఎస్సై విజయ్ మాత్రమే ఉన్నారా లేక మరెవరైనా పోలీసు అధికారుల ప్రమేయం ఉందా.. లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలకు సంబంధించి మరిన్ని ఆధారాలు ఉన్నాయా అనే కోణాల్లోనూ ఏసీబీ అధికారులు దర్యాప్తు కొనసాగుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ అధికారిక విధులను నిర్వహించేందుకు లంచం కోరడం అవినీతి నిరోధక చట్టం కింద నేరమని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. కేవలం డబ్బు స్వీకరించడమే కాకుండా.. లంచం డిమాండ్ చేసినట్లు ఆధారాలు లభించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం డిమాండ్ చేస్తే తమకు ఫిర్యాదు చేయవచ్చని ఏసీబీ అధికారులు పదే పదే సూచిస్తున్నారు.

# నగరి సమస్యలపై గొంతెత్తే గొంతుకలకు పట్టం కట్టండి

**మున్సిపల్ కౌన్సిల్‌లో ప్రజల పక్షాన నిలదీసే**

**సీపీఐ అభ్యర్థులను గెలిపించండి**

**డబ్బు, మద్యం, కులం, మతం ప్రలోభాలకు లొంగొద్దు**



నగరి(ప్రశ్న న్యూస్) నగరి పట్టణ ప్రజా సమస్యలపై మున్సిపల్ కౌన్సిల్‌లో గళమెత్తే అభ్యర్థులను ఎన్నుకోవాలని సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్. నాగరాజు పట్టణ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చే నాయకుల మాటలను మాత్రమే కాకుండా.. ప్రజా సమస్యలపై వారు పోరాడే తీరును, ప్రజలకు అందుబాటులో ఉండే విధానాన్ని పరిశీలించి ఓటు వేయాలని సూచించారు. నగరి మున్సిపాలిటీలోని 1, 7వ వార్డుల్లో సీపీఐ తరపున పోటీ చేస్తున్న పర్వీన్, వి. అశోక్‌కుమార్‌లను గెలిపించాలని కోరారు.

### మూడు దశాబ్దాల ప్రజా పోరాటం, అశోక్‌కుమార్ ప్రస్థానం

నగరి నియోజకవర్గంలో గత 30 సంవత్సరాలుగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగిస్తున్న సీపీఐ పట్టణ కార్యదర్శి కుమారుడైన వి. అశోక్‌కుమార్.. ప్రస్తుతం 7వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాల నేపథ్యంతో ముందుకు వస్తున్న ఆయనకు అవకాశం కల్పించాలని సీపీఐ నాయకులు ఓటర్లను కోరుతున్నారు.మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కౌన్సిల్ సమావేశాల్లో ప్రస్తావించడం, సంబంధిత అధికారులను ప్రశ్నించడం, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడం అవసరమని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. కౌన్సిలర్ పదవి కేవలం హోదా కోసం కాదని.. ప్రజల తరపున బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన వేదిక అని స్పష్టం చేస్తున్నారు

### .ప్రజా సమస్యలపై పోరాటమే పర్వీన్ లక్ష్యం..

నగరి పట్టణంలో నివాసం ఉంటూ గత 20 సంవత్సరాలుగా ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్న షబ్బీర్ భాషా సతీమణి పర్వీన్.. 1వ వార్డు సీపీఐ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. స్థానిక సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పోరాడుతున్న కుటుంబ నేపథ్యంతో ఆమె ఎన్నికల బరిలోకి వచ్చారని పార్టీ నాయకులు తెలిపారు.ప్రజలకు నిత్యజీవితంలో ఎదురయ్యే ఇబ్బందులను మున్సిపల్ పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వాటి పరిష్కారం కోసం కృషి చేయగల ప్రతినిధులు అవసరమని సీపీఐ నేతలు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నగరి పట్టణ కార్యదర్శి వి. వేలన్, సీనియర్ నాయకుడు షబ్బీర్ భాషా, నగరి పట్టణ ఏఐటీయూసీ కార్యదర్శి సుబ్రమణ్యం, నాయకులు సత్తార్, ప్రసాద్, నరసింహులు, శ్రీనివాసులు, నందా, సిరాజ్, ఒనగామూడి తదితరులు పాల్గొన్నారు.

# తుపాను ముప్పు.. జనసేన సేవా దళాలు సిద్ధం కావాలి

**పవన్ కల్యాణ్ పిలుపు.. ఆహారం నుంచి అత్యవసర వైద్యం వరకు సేవలు అందించండి**



అమరావతి(ప్రశ్న న్యూస్) తుపాను ముప్పు పొంచి ఉన్న వేళ ప్రజలకు అండగా నిలవాల్సిన బాధ్యత జనసేన శ్రేణులపై ఉందని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. అర్నబ్ తుపాను ప్రభావంతో కోస్తా జిల్లాల్లో పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని, బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించడంలో జనసేన నాయకులు, వీర మహిళలు, జన సైనికులు ముందుండాలని సూచించారు. తుపాను తీరం దాటిన తర్వాత కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజల ఇబ్బందులను గుర్తించి, సహాయక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు.

### శిబిరాల్లో బాధితులకు అండగా నిలవండి..

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో లోతట్టు, తీర ప్రాంత ప్రజలను సహాయక శిబిరాలకు తరలించిన నేపథ్యంలో వారికి అవసరమైన సదుపాయాలు అందేలా సహకరించాలని పవన్ కల్యాణ్ సూచించారు. శిబిరాల్లో ఉన్నవారికి ఆహారం, పాలు, నిత్యావసర వస్తువులు అందించేందుకు జనసేన శ్రేణులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చిన్నారులు, వృద్ధులు, అత్యవసర వైద్య సహాయం అవసరమైన వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్పష్టం చేశారు.

### రోడ్లపై అడ్డంకులు తొలగించడంలో సహకరించండి..

తుపాను కారణంగా చెట్లు కూలినా, విద్యుత్ స్తంభాలు పడిపోయినా రాకపోకలకు అంతరాయం కలగకుండా సంబంధిత అధికార యంత్రాంగం చేపట్టే సహాయక చర్యలకు జనసేన నాయకులు సహకరించాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు ఎదురైనప్పుడు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి, అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు.

### ప్రచారం కాదు.. ప్రజాసేవకు పరీక్ష..

విపత్తుల సమయంలో ప్రజలకు అండగా నిలవడం రాజకీయ పార్టీలకు కీలక బాధ్యత. తుపాను బాధితుల కష్టాలను గుర్తించి, వారికి తక్షణ సాయం అందించడంలో జనసేన శ్రేణులు చొరవ చూపాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. సహాయక చర్యల్లో పాల్గొనే వారు కూడా తమ భద్రతను దృష్టిలో ఉంచుకోవాలని, వాతావరణ శాఖ, విపత్తుల నిర్వహణ అధికారులు జారీ చేసే సూచనలను పాటించాలని పేర్కొన్నారు.

# జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి

**- జర్నలిస్టులపై దాడులు, అక్రమ కేసులను అరికట్టాలి- ఐఎఫ్‌డబ్ల్యూజే 76వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్)జర్నలిస్టులపై దాడులు, హత్యలు, అక్రమ కేసుల ఘటనలను అరికట్టి, పాత్రికేయులకు పూర్తి రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణతో పాటు వారి సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సూరారంలో ఉన్న బాబు జగ్జీవన్‌రామ్–అంబేద్కర్ భవన్‌లో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) 76వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముఖ్య అతిథులుగా హాజరై, పలువురు సీనియర్ జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను నిర్వహించారు.

### జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులు విధి నిర్వహణలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వార్తల సేకరణ సమయంలో దాడులు, బెదిరింపులు, అక్రమ కేసుల వంటి పరిణామాలు జర్నలిస్టుల భద్రతపై ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఇలాంటి ఘటనలను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావడంతో పాటు, బాధిత జర్నలిస్టులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు గుర్తింపు కల్పించేందుకు జాతీయ జర్నలిస్టుల రిజిస్టర్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న పాత్రికేయుల వివరాలను ధ్రువీకరించి, అర్హులైన వారికి ప్రభుత్వ గుర్తింపు లభించేలా వ్యవస్థను రూపొందించాలని సూచించారు.అలాగే 60 ఏళ్లు పైబడిన సీనియర్ జర్నలిస్టులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు జాతీయ పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. జర్నలిస్టులకు గతంలో అందుబాటులో ఉన్న రైల్వే రాయితీ పాసులను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

### హామీల అమలుతోనే జర్నలిస్టులకు భరోసా

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణ సదుపాయాలు కల్పించడంతో పాటు అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు అందించాలని నాయకులు కోరారు. అనేక మంది జర్నలిస్టులు సొంత ఇళ్లు లేక అద్దె గృహాల్లో నివసిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పాత్రికేయుల సంక్షేమానికి ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేసి, వారి కుటుంబాలకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఐఎఫ్‌డబ్ల్యూజే 1950లో ఏర్పాటై దేశంలో జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం పనిచేస్తున్న సంఘాల్లో ఒకటిగా కొనసాగుతోందని నాయకులు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఢిల్లీతో పాటు వివిధ రాష్ట్రాల్లో వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐఎఫ్‌డబ్ల్యూజే అనుబంధ సంఘమైన టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఈ వేడుకలు జరుగుతున్నాయని వివరించారు.

### పలువురు జర్నలిస్టుల పాల్గొనడం

ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కౌన్సిల్ సభ్యుడు జగదీష్, టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నాగరాజ్ గౌడ్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నాయకులు పి. శంకర్, కావలి మోహన్, కుత్బుల్లాపూర్ ప్రధాన

# మధుమేహం మహమ్మారికి ముందే మేల్కొందాం

**నిర్లక్ష్యం చేస్తే అవయవాలపై పంజా**

**ఆర్థికంగానూ కోలుకోలేని దెబ్బ**

**నవంబర్ నెలంతా ఎస్‌హెచ్ఓలో ఉచిత వైద్య సలహాలు**

**అతి తక్కువ ధరకు 86 రకాల పరీక్షలు**

**కేవలం రూ.1,250కే కంప్లీట్ హెల్త్ చెకప్..**

**ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే లక్ష్యం**



గుంటూరు(ప్రశ్న న్యూస్) మధుమేహం.. నిశ్శబ్దంగా శరీరంలోకి చొరబడే దీర్ఘకాలిక వ్యాధి! తొలినాళ్లలో పెద్దగా లక్షణాలు కనిపించకపోవడంతో చాలామంది నిర్లక్ష్యం చేస్తున్నారు. తీరా సమస్య ముదిరాక ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ ఆరోగ్యంతోపాటు ఆర్థికంగానూ నష్టపోతున్నారు. ఈ ముప్పును ముందుగానే గుర్తించి అడ్డుకోవాల్సిన అవసరం ఉందని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ (ఎస్‌హెచ్ఓ) హెచ్చరిస్తోంది. మధుమేహంపై శాస్త్రీయ అవగాహన పెంచడంతోపాటు, ముందస్తు జాగ్రత్తల ద్వారా వ్యాధి ముప్పును తగ్గించేందుకు ప్రజలంతా భాగస్వాములు కావాలని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ టి. సేవకుమార్ పిలుపునిచ్చారు.

### చిన్న నిర్లక్ష్యం.. పెద్ద మూల్యం..

దేశంలో మధుమేహ సమస్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని డాక్టర్ సేవకుమార్ పేర్కొన్నారు. వయసుతో సంబంధం లేకుండా ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. మధుమేహాన్ని సాధారణ సమస్యగా తీసుకుంటే కిడ్నీలు, కళ్లు, గుండె, నరాలు సహా శరీరంలోని పలు అవయవాలపై ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. వ్యాధి నియంత్రణలో లేకపోతే దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం పెరుగుతుందని వివరించారు.మధుమేహం వచ్చిన తర్వాత నెలనెలా పరీక్షలు, వైద్యుల సంప్రదింపులు, మందుల వినియోగం వంటి ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు. అందుకే వ్యాధి ముదిరిన తర్వాత బాధపడటం కంటే ముందుగానే అవగాహన పెంచుకోవడం ముఖ్యమన్నారు.
సమతుల ఆహారం, క్రమబద్ధమైన వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలి, అవసరమైనప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా మధుమేహం వచ్చే ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు.సంప్రదించాల్సిన వ్యక్తి: డాక్టర్ టి. సేవకుమార్, వ్యవస్థాపక అధ్యక్షుడు, సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్‌టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, గుంటూరు.

# తుఫాను ముప్పు.. ఇంద్రకీలాద్రిపై అప్రమత్తం

**కొండచరియలు జారితే ప్రమాదమే..**

**ఘాట్ రోడ్డులో ఈవో క్షేత్రస్థాయి తనిఖీలు..**



విజయవాడ(ప్రశ్న న్యూస్) ఓవైపు తుఫాను హెచ్చరికలు.. మరోవైపు భారీ వర్షాల ముప్పు! నిత్యం వేలాది మంది భక్తులతో రద్దీగా ఉండే ఇంద్రకీలాద్రిపై అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కొండ ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచినా, కొండచరియలు జారిపడినా భక్తుల భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉండటంతో ముందస్తు చర్యలపై దృష్టి సారించింది. శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్ బుధవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఘాట్ రోడ్డులోని కీలక ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి అప్రమత్తంగా ఉండాలని, వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

### కొండచరియలపై ప్రత్యేక నిఘా..

దసరా ఉత్సవాలకు ముందు కొండచరియలు జారిపడిన ప్రాంతంతోపాటు, భారీ వర్షాలకు రాళ్లు జారిపడే అవకాశం ఉన్న సున్నిత ప్రాంతాలను ఈవో పరిశీలించారు. ఓం టర్నింగ్, ఘాట్ రోడ్డు, టోల్‌గేట్ పరిసరాల్లో పరిస్థితిని సమీక్షించారు. వర్షాలు తీవ్రతరం అయితే కొండపై నుంచి నీరు వేగంగా ప్రవహించే అవకాశం ఉన్నందున డ్రైనేజీ మార్గాల్లో ఎక్కడా అడ్డంకులు ఉండకూడదని స్పష్టం చేశారు. భక్తులకు నిరంతరాయంగా వేడి అన్నప్రసాదం అందుబాటులో ఉంచేలా సంబంధిత విభాగాలు చర్యలు తీసుకోవాలని సూచించారు.తుఫాను ప్రభావం నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై భక్తుల భద్రత, మౌలిక సదుపాయాల నిర్వహణ కీలకంగా మారాయి. వర్షాలు కురిసే సమయంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా పనిచేయడం, ప్రమాదకర ప్రాంతాల్లో నిఘా, విద్యుత్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, అన్నప్రసాద సరఫరా వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.క్షేత్రస్థాయి పరిశీలనలో ఈవోతో పాటు ఇంజినీరింగ్ అధికారులు రమ, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుంట్ల కవితను కలిసి ఆశీర్వాదం తీసుకున్న డివిజన్ అధ్యక్షులు

**ఉప్పల్ నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేనను బలోపేతం చేస్తాం**

**ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతాం: డివిజన్ అధ్యక్షులు**



ఉప్పల్(ప్రశ్న న్యూస్)తెలంగాణ రక్షణ సేన ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రమణ దేవ్ ఆధ్వర్యంలో వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షుడు రంగు శేఖర్ గౌడ్, రామంతాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఓర్సు బాలకృష్ణ తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు మాట్లాడుతూ, తమపై నమ్మకంతో డివిజన్ అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించినందుకు కల్వకుంట్ల కవితకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉప్పల్ నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేనను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడుతూ, పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొని విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. రానున్న కార్పొరేటర్ ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గంలో అత్యధిక స్థానాల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నవీన్ గోవికరణ, ఉప్పల్ నియోజకవర్గ బంజారా అధ్యక్షుడు భూక్య కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ‘దహాన్’ (ఆహా) మూవీ రివ్యూ!



హారర్ థ్రిల్లర్ సినిమాలకి ఓటీటీ ఫ్లాట్ ఫామ్ పై ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసిన పనిలేదు. ఈ జోనర్ నుంచి వచ్చిన సినిమాలను చూడటానికి ఆడియన్స్ ఎక్కువ కుతూహలాన్ని కనబరుస్తూ ఉంటారు. అలా ఒడియాలో రూపొందిన సినిమానే ‘దహాన్’. అనుపమ్ పట్నాయక్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ‘ఆహా’లో ఈ నెల 16వ తేదీ నుంచి తెలుగు .. తమిళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. అది ఫారెస్ట్ ఏరియాకి దగ్గరగా ఉన్న పెద్ద బంగ్లా. ఆ బంగ్లా క్రిందనే కొన్ని వ్యవసాయ భూములు ముడిపడి ఉంటాయి. ఒకప్పుడు జమీందార్ కి సంబంధించిన బంగ్లా అది. ఆయన ఆ బంగళాలో ఒంటరిగా నివసించేవాడు. ఆ తరువాత ఒక రోజున ఆయన బాల్కనీలో నుంచి దూకేసి ఆత్మహత్య చేసుకుంటాడు. అందుకు కారణం ఏమిటనేది ఎవరికీ తెలియదు. ఆ బంగ్లా పాడుబడిపోతూ ఉంటుంది. ఆయన భూములను ఎవరెవరో సాగుచేసుకుంటూ ఉంటారు. అలాంటి పరిస్థితులలో ఆయన వారసురాలిగా ‘ఆనందిత’ అక్కడికి వస్తుంది. ఆ బంగ్లాతో పాటు మిగతా భూములను కూడా అమ్మేసుకుని పోవాలనే ఉద్దేశంతో, ఆనందిత తన తమ్ముడు ‘సమర్’ .. చెల్లెలు ‘మనూ’తో కలిసి అక్కడికి వస్తుంది. ఆర్థికపరమైన ఇబ్బందుల కారణంగానే ఆమె ఆ బంగ్లాను అమ్మేయాలనే ఆలోచన చేస్తుంది. అయితే ఆమె తీసుకున్న నిర్ణయం ఆ భూములను సాగుచేసుకుంటున్నవారికి ఆగ్రహాన్ని కలిగిస్తుంది. వాళ్లు ఆ బంగ్లాలో ఉండేలా ‘పర్వేజ్’ అన్నిరకాల ఏర్పాట్లు చేస్తాడు. ఆ ఇంటి వెనుక భాగంలో ఒక అవుట్ హౌస్ ఉంటుంది. బంగ్లాకి సంబంధించిన పాత సామాను అంతా అవుట్ హౌస్ లోనే ఉంటుంది. భూముల అమ్మకానికి సంబంధించిన పనులపై ఆనందిత బయటికి వెళ్లినప్పుడు, మనూ అవుట్ హౌస్ తలుపులు తెరుస్తుంది. లోపల ఉన్న ఒక చెక్కపెట్టెను ఆమె ఓపెన్ చేస్తుంది. అందులో కొన్ని చిత్రమైన వస్తువులు ఉంటాయి. ఆ పెట్టెను ఓపెన్ చేసిన దగ్గర నుంచి ‘మనూ’ వింతగా ప్రవర్తించడం మొదలుపెడుతుంది. రాత్రి వేళలో ఆ పెట్టెలో నుంచి వింత శబ్దాలు వస్తుంటాయి. ఆ పెట్టెపై రాసిన అక్షరాలు ఏమిటనేది ఆనందితకు అర్థం కాదు. అందువలన ఆమె ఆ లెటర్స్ ను ఫొటో తీసి తన ఫ్రెండ్ ‘ఆదిత్య’కు పంపిస్తుంది. హిబ్రూ భాషలో ‘దహాన్’ అని రాసి ఉందని ఆదిత్య చెబుతాడు. ఆ పెట్టె తమ ఇంట్లోకి ఎలా వచ్చింది? ఆ పెట్టెతో తన తండ్రికి .. తాతకి ఉన్న సంబంధం ఏమిటి? అసలు ఆయన దానిని ఎక్కడి నుంచి తీసుకొచ్చాడు? దానిని ఓపెన్ చేసిన దగ్గర నుంచే ‘మనూ’లో ఎందుకు మార్పు వచ్చింది? అనే విషయాలకు తన పెదనాన్న దగ్గర సమాధానాలు ఉండొచ్చని ఆనందిత భావిస్తుంది. ఉన్నపలంగా బయల్దేరి పెదనాన్న దగ్గరికి వెళుతుంది. అక్కడ ఏం జరుగుతుంది? ఆమెకు తెలిసే నిజాలు ఏమిటి? ప్రేతాత్మ బారి నుంచి ఆమె తన చెల్లెలిని కాపాడుకోగలుగుతుందా? అనేది కథ.తమ పూర్వీకులకి సంబంధించిన ఆస్తులను అమ్ముకుని వెళ్లిపోవడం కోసం వాళ్ల వారసులు సొంత ఇంటికి వస్తారు. అడవికి సమీపంలోని ఒక పాడుబడిన బంగళా అది. వారిలో ఒకరు అక్కడి అవుట్ హౌస్ లో దాచిన ఒక చెక్కపెట్టెను ఓపెన్ చేస్తారు. అప్పటి నుంచి వాళ్లకి ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి? అందుకు గల కారణాలు ఏమిటి? తమ పూర్వీకులకు .. ఆ చెక్కపెట్టెకు ఉన్న సంబంధం ఏమిటి? అనేదే ఈ కథలోని ప్రధానమైన అంశం. సాధారణంగా ప్రేతాత్మలకు సంబంధించిన కథలన్నీ పాడుబడిన బంగ్లా చుట్టూ తిరుగుతూ ఉంటాయి. ప్రేతాత్మలను ఒక సీసాలోనో .. పెట్టెలోనో బంధించడం, తెలియక వాటికి విముక్తి కల్పించడం .. దాంతో అవి విజృంభించడం చాలా కథలలో చూస్తూనే వచ్చాము. విడుదలైన ప్రేతాత్మలు పీడించడం .. ఆ ప్రేతాత్మల బారి నుంచి తప్పించుకోవడానికి బాధితులు ప్రయత్నించడం ఈ తరహా కథలలో ప్రధానంగా కనిపిస్తూ ఉంటాయి. అదే పద్ధతిలో ఈ కథ కూడా నడుస్తుంది. ఈ కథ మొదలుపెట్టిన అరగంట వరకూ చాలా నిదానంగా సాగుతుంది. ఆ తరువాతనే పుంజుకోవడం మొదలవుతుంది. అసలు ఆ పెట్టెలో ఏవుంది? అందులో ఉన్న వస్తువులు ఎవరివి? ప్రేతాత్మగా మారింది ఎవరు? దానితో ఆనందిత తాతయ్యకి ఉన్న సంబంధం ఏమిటి? అనే సందేహాలు ఆడియన్స్ లో ఆసక్తిని రేకెత్తిస్తూ వెళతాయి. ఇంటర్వెల్ నుంచి ఈ కథ మరింత వేగాన్ని అందుకుంటుంది. ప్రేతాత్మకు సంబంధించిన పెట్టెను వదిలించుకోవడానికి ఆనందిత ప్రయత్నించడం .. ఆ పెట్టెను ఎప్పటికప్పుడు మనూ కాపాడుకుంటూ ఉండటం కథను మరింత ఉత్కంఠభరితంగా మార్చుతూ వెళుతుంటుంది. ఇక ఇదే సమయంలో ఆనందిత వైపు నుంచి చర్చి ఫాదర్ ఎంట్రీ ఇవ్వడంతో కథ పతాకస్థాయి దిశగా పరుగులు పెడుతుంది. ప్రీ క్లైమాక్స్ .. క్లైమాక్స్ కి సంబంధించిన దృశ్యాలు కాస్త గట్టిగానే భయపెడతాయి. ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ కాస్త కొత్తగా అనిపిస్తుంది. అయితే ప్రేతాత్మలకు సంబంధించిన చాలా రొటీన్ సన్నివేశాలనే ఇందులోను చూస్తాము. ప్రేతాత్మ ఆవహించినప్పుడు వాళ్లు ప్రవర్తించే తీరును, అలాగే ఆడియన్స్ ను భయపెట్టడానికి అనుసరించే మార్గాలను చాలా సినిమాలలో చూపించారు. అవే సన్నివేశాలను మరోమారు చూస్తున్నట్టుగా ఉంటుంది. కొత్తగా డిజైన్ చేయకపోవడమే లోపంగా అనిపిస్తుంది. కెమెరా పనితనం .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఫరవాలేదు. హారర్ థ్రిల్లర్ జోనర్ కి తగినట్టుగా ఈ కథ అక్కడక్కడా భయపడుతుంది. ప్రేతాత్మ ఆవహించడం .. వదిలించే ప్రక్రియ .. ఈ మధ్యలో జరిగే తతంగం కాస్త అలజడి సృష్టిస్తాయి. అయితే గతంలో కొన్ని హారర్ సినిమాలలో చూసిన సన్నివేశాలనే మళ్లీ చూస్తున్నట్టుగా అనిపిస్తుంది. అందువలన ఆడియన్స్ పూర్తిస్థాయి థ్రిల్ ను పొందలేరేమోనని అనిపిస్తుంది.

## ధన్‌రాజ్ కెరీర్‌కు బిగ్ బూస్ట్ ఇవ్వనున్న

# ‘వరం’ వెబ్ సిరీస్!



టాలీవుడ్‌లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా, కమెడియన్‌గా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న నటులలో ధన్‌రాజ్ వినీత్ ఒకరు. ఇటీవలే దండోరా సినిమాలో తన నటనతో మెప్పించిన అతడు వైవిధ్యమైన పాత్రలతో ఎప్పుడూ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నాడు. ఈ క్రమంలోనే అతడు తాజాగా నటించిన వెబ్ సిరీస్. ‘వరం’. మెగా డాటర్ సుస్మిత కొణిదెల నిర్మాణంలో రూపొందిన ఈ సూపర్ నేచురల్ క్రైమ్ థ్రిల్లర్ జియోహాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతూ మంచి టాక్ తెచ్చుకుంటోంది. ఈ సిరీస్ విజయం, ఇందులో ఆయన పాత్ర తీరుతెన్నులు ధన్‌రాజ్ కెరీర్‌కు ఏ విధంగా పెద్ద ప్లస్ కాబోతున్నాయనేది చూద్దాం.

‘వరం’ సిరీస్‌లో ధన్‌రాజ్ హీరో రాజు (విశ్వదేవ్ రాచకొండ) స్నేహితుడిగా ‘నాని’ పాత్రలో నటించారు. సాధారణంగా సినిమాలలో హీరో ఫ్రెండ్ అనగానే కేవలం కొన్ని కామెడీ సీన్లకు మాత్రమే పరిమితం చేస్తుంటారు. కానీ ఈ సిరీస్‌లో ధన్‌రాజ్ కేవలం నవ్వించడమే కాకుండా, కథ ముందుకు సాగే కొద్దీ వచ్చే మలుపులలో ఒక కీలకమైన భాగస్వామిగా కనిపిస్తారు. ఆయన పాత్రలోని సహజత్వం, టైమింగ్ డైలాగులు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తూనే, కథలో ఇమిడిపోయేలా ఉంటాయి.కేవలం కామెడీ జోనర్‌కే పరిమితం కాకుండా, థ్రిల్లర్ జోనర్ కథల్లోనూ తాను ఏ పాత్రనైనా అవలీలగా చేయగలనని ధన్‌రాజ్ ఈ సిరీస్ ద్వారా మరోసారి నిరూపించారు. కథానాయకుడితో సమానంగా ప్రయాణించే ఈ పాత్రలో ధన్‌రాజ్ నటనకు మంచి స్కోప్ దక్కింది. ప్రతి ఎపిసోడ్‌లోనూ ఆయన పాత్ర ప్రేక్షకుడికి గుర్తుండిపోయేలా ఉండటం ఆయనకు పెద్ద ప్లస్ పాయింట్. నేడు థియేటర్ల కంటే ఓటీటీ కంటెంట్‌కు ఆదరణ విపరీతంగా పెరిగింది. జియోహాట్‌స్టార్ లాంటి పెద్ద ప్లాట్‌ఫారమ్‌లో వస్తున్న ఈ సిరీస్ ద్వారా ధన్‌రాజ్ నటన దేశవ్యాప్తంగా లేదా పాన్-ఇండియా స్థాయిలో డిజిటల్ ప్రేక్షకులకు మరింత చేరువయ్యే అవకాశం ఉంది. మొత్తానికి, ‘వరం’ సిరీస్ ధన్‌రాజ్ వినీత్ నటుడిగా తన పరిధిని మరింత విస్తరించుకోవడానికి, భవిష్యత్‌లో మరిన్ని బలమైన పాత్రలు ఆయనను వెతుక్కుంటూ రావడానికి ఒక చక్కని మెట్టుగా నిలవనుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే అక్టోబర్ 29న విడుదలయ్యే ఇంకో రెండు ఎపిసోడ్‌లలో ధనురాజ్ పాత్ర ఎలా ఉండబోతుంది అనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

# హృతిక్ రోషన్ ‘రోడీ థీమ్’ విడుదల




సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన ‘జైలర్ 2’ చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డుల ప్రభంజనం సృష్టిస్తోంది. ఈ సినిమా విజయోత్సాహంలో ఉన్న చిత్రబృందం, ప్రేక్షకులకు మరో ప్రత్యేకమైన కానుకను అందించింది. ఈ చిత్రంలో బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ పోషించిన ‘రోడీ’ పాత్ర కోసం రూపొందించిన స్పెషల్ థీమ్ మ్యూజిక్‌ను చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. ప్రస్తుతం ఈ థీమ్ యూట్యూబ్‌లో విశేషంగా ఆకట్టుకుంటోంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ స్వరపరిచిన ఈ ‘రోడీ థీమ్’ ఒక పవర్‌ఫుల్ ఇన్‌స్ట్రుమెంటల్ ట్రాక్. సినిమాలో హృతిక్ పాత్ర ఎంట్రీ, ఎలివేషన్ సన్నివేశాల్లో వచ్చే ఈ మ్యూజిక్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇప్పుడు ఈ థీమ్‌ను అధికారికంగా విడుదల చేయడంతో అభిమానులు మరోసారి ఆ థ్రిల్‌ను ఆస్వాదిస్తున్నారు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో, సన్ పిక్చర్స్ నిర్మాణంలో తెరకెక్కిన ‘జైలర్ 2’ ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ.700 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఈ చిత్రంలో హృతిక్ రోషన్ ‘రోడీ’ అనే కీలకమైన అతిథి పాత్రలో మెరిశారు. కథలో, క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న టైగర్ ముత్తువేల్ పాండియన్‌కు సహాయం చేసే శక్తిమంతమైన మిత్రుడిగా ఆయన పాత్ర సాగుతుంది. గతంలో టైగర్ తనకు చేసిన సహాయానికి కృతజ్ఞతగా రోడీ అండగా నిలుస్తాడు. ఈ పాత్ర ద్వారా హృతిక్ రోషన్ తమిళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టడం విశేషం. అంతేకాదు, దాదాపు 40 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత రజనీకాంత్, హృతిక్ రోషన్ మళ్లీ ఒకే తెరపై కనిపించడం అభిమానులకు ప్రత్యేక అనుభూతినిచ్చింది. 1986లో వచ్చిన ‘భగవాన్ దాదా’ చిత్రంలో హృతిక్ బాలనటుడిగా రజనీకాంత్‌తో కలిసి నటించారు. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ ఇద్దరూ ఒకే ఫ్రేమ్‌లో కనిపించడం సినిమాకు అదనపు ఆకర్షణగా నిలిచింది. ‘జైలర్ 2’లో రజనీకాంత్‌తో పాటు మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్, రమ్యకృష్ణ, విద్యా బాలన్, ఎస్‌జే సూర్య, విజయ్ సేతుపతి వంటి భారీ తారాగణం నటించి, దీనిని ఒక పాన్-ఇండియన్ బ్లాక్‌బస్టర్‌గా నిలబెట్టారు.

# పవర్‌పేట పడమటవీధి జానకి



‘మిరాయ్’ ‘కొరియన్ కనకరాజు’ చిత్రాల ద్వారా యువతరంలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది ఒరిస్సా సొగసరి రితికా నాయక్. ఆమె సందీప్‌కిషన్‌తో కలిసి నటిస్తున్న తాజా చిత్రం ‘పవర్‌పేట’. కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మాతలు. మంగళవారం రితికా నాయక్ పుట్టిన రోజు సందర్భంగా పడమటవీధి జానకిగా ఆమె పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఇందులో ఈ భామ సంప్రదాయ వస్త్రధారణలో చూడముచ్చటగా కనిపిస్తున్నది. రాజకీయ నేపథ్యంలో ఆధిపత్య పోరు, ప్రేమ, గౌరవం ప్రధానాంశాలుగా చిత్రాన్ని రూపొందిస్తున్నామని, కథాగమనంలో పడమటవీధి జానకి పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుందని మేకర్స్ తెలిపారు. ఇప్పటికే అరవైశాతం చిత్రీకరణ పూర్తయిందని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, రచన-దర్శకత్వం: కృష్ణచైతన్య.

# ఆదర్శకుటుంబం నా కెరీర్‌లోనే ప్రత్యే కం



‘25ఏళ్ల తర్వాత త్రివిక్రమ్‌తో పనిచేశాను. మా కాంబినేషన్ అంటే అంచనాలుంటాయి. అందుకు తగ్గట్టే ఆల్ ఎమోషన్స్‌తో మంచి స్క్రిప్ట్ తెచ్చాడు. కథ విని చాలా ఆనందించా. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది. ఇది నాకెరీర్‌లోనే వెరీవెరీ స్పెషల్ మూవీ. పనిచేసిన వారంతా ప్రాణం పెట్టారు. తప్పకుండా సినిమా విజయం సాధిస్తుందని నమ్ముతున్నా’ అని అగ్ర కథానాయకుడు వెంకటేశ్ ఆశాభావం వెలిబుచ్చారు. ఆయన హీరోగా రూపొందిన ఫ్యామిలీ థ్రిల్లర్ ‘ఆదర్శకుటుంబం -హౌస్ నెం ాఖ 47’. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఎస్.రాధాకృష్ణ(చినబాబు) నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో వెంకటేశ్ మాట్లాడారు. చిత్ర దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ‘కుటుంబాన్ని మనం సెలక్ట్ చేసుకోం. అది ఇవ్వబడుతుంది. అలా ఇవ్వబడిన బంధాలను కాపాడుకోవడానికి నలుగురు వ్యక్తులు ఎంతదూరం వెళ్లారు? సామాన్యుడు తెగిస్తే ఎంతదూరం వెళ్తాడు? అనే ప్రశ్నలకు సమాధానమే ఈ సినిమా. కలియుగంలో మనుషులు ఎలా ఉంటారో, మనస్తత్వాలు ఎలా ఉంటాయో ఉద్ధవగీతలో కృష్ణుడు చెప్పారు. మనుషుల్లో ఆశ, కోరిక, కలహప్రియత్వం ఎక్కువవుతాయని ఆనాడు ఆయన చెప్పినట్టే, నేడు ప్రపంచం నడుస్తున్నది. ఆ పరిస్థితుల్లో మనకు తోడుగా ఉండేది కుటుంబం మాత్రమే. అది కూడా దూరమైతే మనుషులు ఎవరికోసం బతకాలి? అందుకే కుటుంబ బంధాల గురించి పదేపదే చెప్పే ప్రయత్నం చేస్తుంటాను. కుటుంబం లోతైన బావి లాంటిది. మన దాహాన్ని, ఆర్తిని తీరుస్తుంది. అలాంటి కుటుంబాల గురించి చెప్పడానికి సరైన మనిషి ఎవరున్నారు? వెంకటేశ్ తప్ప. ఫ్యామిలీ సినిమాలతో సూపర్‌స్టార్ అవ్వొచ్చని నిరూపించిన వ్యక్తి వెంకటేశ్. పద్మవ్యూహం లాంటి కుటుంబంలోకి అభిమన్యుడిలా వెళ్లి, బయటకు రావడం తెలియక చనిపోతారా? అర్జునుడిగా వెళ్లి, గెలిచి బయటకొస్తారా? అని చెప్పేదే ఈ సినిమా’ అని త్రివిక్రమ్ శ్రీనివాస్ చెప్పారు. ఇంకా నిర్మాత ఎస్.రాధాకృష్ణ, కథానాయికలు శ్రీనిధిశెట్టి, నివేద పేతురాజ్, సంగీత దర్శకుడు తమన్, కమెడియన్ సత్య, నటుడు బ్రహ్మాజీ తదితరులు కూడా ఈ కార్యక్రమంలో మాట్లాడారు.

# ‘రామాయణ’ చూసి ఆశ్చర్యపోయా..

## ‘లార్డ్ ఆఫ్ ది రింగ్స్’తో పోల్చిన హాలీవుడ్ విమర్శకుడు!



భారతీయ ఇతిహాసం ఆధారంగా తెరకెక్కుతున్న భారీ చిత్రం ‘రామాయణ: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్’పై అంతర్జాతీయ స్థాయిలో ఆసక్తి పెరుగుతోంది. ఈ సినిమా ప్రపంచ ప్రీమియర్ లాస్ ఏంజెలెస్‌లో బుధవారం ఉదయం భారత కాలమానం ప్రకారం జరిగింది. చిత్ర బృందంతో పాటు పలువురు అంతర్జాతీయ సినీ విమర్శకులు ఈ ప్రత్యేక ప్రదర్శనకు హాజరయ్యారు. సినిమా ఇంగ్లిష్ వెర్షన్‌ను వీక్షించిన ఓ విమర్శకుడు చేసిన పోస్ట్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 2001లో విడుదలైన ‘ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్’ సినిమా చూసినప్పుడు కలిగిన అద్భుతమైన అనుభూతి, ఇప్పుడు ‘రామాయణ’ చిత్రాన్ని చూసినప్పుడు మరోసారి కలిగిందని ఆ అంతర్జాతీయ విమర్శకుడు పేర్కొన్నారు. ఈ కామెంట్స్ సినిమా తనపై ఎంతటి ప్రభావం చూపిందో తెలియజేస్తోంది. ముఖ్యంగా భగవాన్ శ్రీరాముడి పాత్రను తెరపై ఆవిష్కరించిన తీరును ఆయన ప్రశంసించారు. అయితే, ప్రస్తుతం సినిమా పూర్తి సమీక్షలను ప్రచురించడంపై ఆంక్షలు ఉండటంతో కథ, నటీనటుల ప్రదర్శన, సాంకేతిక అంశాలపై ఆయన పెద్దగా స్పందించలేదు. రివ్యూలపై ఆంక్షలు తొలగిన తర్వాతే తన పూర్తి అభిప్రాయాలను వెల్లడించనున్నట్లు తెలిపారు.‘రామాయణ’ తొలి భాగం ముగింపు ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేసేలా ఉంటుందని కూడా ఆ విమర్శకుడి స్పందన ద్వారా తెలుస్తోంది. సినిమా చివర్లో తెర నల్లగా మారినప్పుడు తాను ఆశ్చర్యంతో గట్టిగా అరిచానని ఆయన పేర్కొన్నారు. ఈ ముగింపు రెండో భాగంపై ఆసక్తిని మరింత పెంచేలా ఉంటుందని అంచనా వేస్తున్నారు. తన పూర్తి సమీక్షను ఆదివారం ప్రచురిస్తానని, అప్పటికి సమీక్షలపై ఉన్న ఆంక్షలు తొలగుతాయని ఆయన తెలిపారు. దర్శకుడు నితేశ్ తివారీ తెరకెక్కిస్తున్న రామాయణ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయిపల్లవి సీత పాత్రలో, యశ్ రావణుడి పాత్రలో నటిస్తున్నట్లు ప్రచారంలో ఉంది. సన్నీ డియోల్, రవి దూబే, అరుణ్ గోవిల్, లారా దత్తా, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, వివేక్ ఒబెరాయ్, అనుపమ్ ఖేర్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. నమిత్ మల్హోత్రా నిర్మాణ బాధ్యతలు చేపట్టగా, యశ్ కూడా నిర్మాణంలో భాగస్వామిగా ఉన్నారు.

# అలా వెళ్లిపోకే బంగారం..



నితిన్ హీరోగా నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ‘అలియాస్ రుక్మిణి’. ‘దండోరా’ ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అగ్ర హీరో నాని సమర్పణలో ఆయన సోదరి దీప్తి గంటా నిర్మిస్తున్నారు. డిసెంబర్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా మంగళవారం మ్యూజికల్ ప్రమోషన్స్‌ను ప్రారంభిస్తూ ‘రుక్కు రుక్కు రుక్మిణి’ అనే తొలి పాటను విడుదల చేశారు. విజయ్ బుల్గానిన్ స్వరపరచిన ఈ పాటను పూర్ణాచారి రచించారు. అనురాగ్ కులకర్ణి ఆలపించారు. ఇందులో మధ్యతరగతి యువకుడైన కృష్ణగా నితిన్, స్కూల్ టీచర్ రుక్మిణి పాత్రలో కథానాయిక ఆఫియా సయ్యద్ కనిపించారు. పాటలోని విజువల్స్, నాయకానాయికల మధ్య కెమిస్ట్రీ ప్రధానాకర్షణగా నిలిచింది. ‘తకధిమి తానా అని ఆడుకోకే బంగారం, తికమక చేసి అలా వెళ్లిపోకే బంగారం, బహుమతిలాగా నిన్ను చూసుకుంటా బంగారం, రుక్కు రుక్కు రుక్మిణి ..ఒప్పేసుకో నా రాణి’ అంటూ చక్కటి భావాలతో ఈ పాట సాగింది. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్, రచన-దర్శకత్వం: మురళీకాంత్ దేవసోత్.

## భూ భారతిపై రైతులకు విస్తృత అవగాహన

**సర్వే నంబర్ల వారీగా భూముల రీ సర్వే ప్రక్రియపై అధికారుల వివరణ**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్)రైతుల భూ హక్కులకు స్పష్టత కల్పించడం, భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'భూ భారతి' కార్యక్రమంపై మేడ్చల్ మండల పరిధిలోని గోసాయిగూడ గ్రామంలో బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భూముల రీ సర్వే ప్రక్రియ, సర్వే నంబర్ల వారీగా చేపట్టే చర్యలు, భూ రికార్డుల నిర్వహణపై అధికారులు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు, తహశీల్దార్ వీరనాల భూపాల్, మండల సర్వేయర్ వినోద్, ఆర్ఐ చందన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. గ్రామాల్లోని భూములకు సంబంధించి హక్కులు, సరిహద్దుల విషయంలో స్పష్టత తీసుకురావడమే రీ సర్వే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సర్వే నంబర్ల వారీగా భూములను పరిశీలించడం, భూ రికార్డులను నమోదు చేయడం, భూముల హద్దులను గుర్తించడం వంటి అంశాలను రైతులకు సవివరంగా వివరించారు. రీ సర్వే ప్రక్రియ ద్వారా భూముల వివరాలను స్పష్టంగా గుర్తించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రైతులు భూ రికార్డులు, భూముల సరిహద్దులు, సర్వే విధానాలకు సంబంధించి అడిగిన సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. భూములకు సంబంధించిన పత్రాలు, వివరాల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, సర్వే సమయంలో అధికారులకు అవసరమైన సమాచారం అందించి సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారానికి, రైతులకు తమ భూములపై స్పష్టత కల్పించేందుకు చేపడుతున్న రీ సర్వే ప్రక్రియలో రైతులందరూ భాగస్వాములై అధికారులకు సహకరించాలని కోరారు. ఈ అవగాహన సదస్సులో మాజీ వార్డు సభ్యుడు రేగు మహేష్‌తో పాటు గ్రామస్తులు బోదారి అశోక్, బి. నాగేష్, ఎం. శంకర్, జి. కృష్ణ, పుట్నాల రాజు, రేగు ప్రభాకర్, బి. దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సరైన పత్రాలు లేని వాహనాలు సీజ్

**సర్కిల్ ఇన్స్పెక్టర్ అంజిరెడ్డి**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేఎల్ఆర్ నగర్ లో గల శివాజీ విగ్రహం వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో భాగంగా నిర్వహించిన ఈ తనిఖీల్లో రహదారిపై రాకపోకలు సాగిస్తున్న ద్విచక్ర వాహనాలు, కార్లను నిలిపి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ క్రమంలో సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, వాహన బీమా తదితర అనుమతి పత్రాలు లేని వాహనాలను పోలీసులు గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ అంజిరెడ్డి మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రయాణాల్లో సరైన పత్రాలు వెంట ఉంచుకోవాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ వాహన తనిఖీ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ సురేష్‌లతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కరెంటు తీగలకు చెట్ల కొమ్మలు..

# నిత్యం స్పార్కులు

**భయాందోళనలో వీకర్ సెక్షన్ కాలనీవాసులు**

**చెట్ల కొమ్మలు తొలగించరా.? విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం**

**అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన**



కీసర ( ప్రశ్న న్యూస్) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని బండ్లగూడ వీకర్ సెక్షన్ కాలనీలో విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగులుతుండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగలడంతో తరచూ స్పార్కులు వచ్చి మంటలు చెలరేగే పరిస్థితి నెలకొంటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగలడం వల్ల తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా విద్యుత్ తీగల నుంచి నిప్పురవ్వలు రావడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులకు పలుమార్లు తెలియజేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించి, ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని వీకర్ సెక్షన్ కాలనీవాసులు కోరుతున్నారు.

## బండ్లగూడలో అభివృద్ధి పనులకు శ్రీకారం

**నాలుగో వార్డులో రూ.10.50 లక్షలతో**

**యూజీడీ పనులు ప్రారంభం**



కీసర( ప్రశ్న న్యూస్) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ బండ్లగూడ నాలుగో వార్డు పరిధిలోని ఆనందతీర్థనగర్ కాలనీ, సాయిరాం నగర్ కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) పనులను ప్రారంభించారు. ఈ రెండు కాలనీల్లో మొత్తం 230 మీటర్ల పొడవున, ఒక అడుగు వ్యాసం కలిగిన డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులకు రూ. 10.50 లక్షల అంచనా వ్యయాన్ని కేటాయించారు. కాలనీల్లో మురుగునీటి సమస్యలను పరిష్కరించి, ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించడమే ఈ పనుల ప్రధాన ఉద్దేశం. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి రావడంతో మురుగునీటి పారుదల సమస్యలు తగ్గుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ దమ్మాయిగూడ అధ్యక్షులు ముప్పా రామారావుతో పాటు బండ్లగూడ మాజీ సర్పంచ్ గండి యాదగిరి గౌడ్, సంజీవ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రవణ్ రెడ్డి, గౌస్, ప్రసాద్ గౌడ్, సుమేష్, సమ్మి రెడ్డి, శ్రీలత, బాలమణి, దిలీప్, జగన్, కిట్టు, బజరంగ్ తదితరులు, ఆయా కాలనీల నివాసితులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



జగిత్యాల (ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసులు, ట్రాఫిక్ నిబంధనల అమలు, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలపై సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లు, ఈ-చలాన్ విధానం, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించిన వివరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లా కేంద్రంలో పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, విద్యాసంస్థల పరిసరాలు, బస్టాండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారు, అతివేగంగా ప్రయాణించేవారు, రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపేవారు, ట్రిపుల్ రైడింగ్ చేసేవారు, హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులు, సీట్ బెల్ట్ ధరించని వాహనదారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైనర్లు వాహనాలు నడపకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై నిరంతర తనిఖీలు చేపట్టాలని తెలిపారు. ఎస్పి వెంట డిఎస్పి పురుషోత్తం రెడ్డి, టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, ట్రాఫిక్ ఎస్.ఐ మల్లేశం, సిబ్బంది ఉన్నారు.

## ప్రతి ఒక్క పట్టభద్రులు తమ ఓటును

# నమోదు చేసుకోవాలి

**కాంగ్రెస్ సీనియర్ నేత సాయి పేట శ్రీనివాస్**





మేడ్చల్ ( ప్రశ్న న్యూస్ ) పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నిలబెట్టిన అభ్యర్థిగా ఓటు వేయాలని గుండ్ల పోచంపల్లి మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసి, మాజీ కౌన్సిలర్ సాయి పేట శ్రీనివాస్ కోరారు. గుండ్లపోచంపల్లి డివిజన్ కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాయి పేట శ్రీనివాస మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేసిన వారు సైతం మళ్లీ తమ ఓటు ను నమోదు చేసుకోవాలని సాయి పేట శ్రీనివాస్ కోరారు. ఆధార్ కార్డు, డిగ్రీ లేదా డిప్లమా, సర్టిఫికెట్ మొబైల్ నెంబరు, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోతో తమ ఓటును నమోదు చేసుకోవాలని కోరారు. హైదరాబాద్ స్థానానికి పోటీలో ఉన్న సామ రామ్మోహన్ రెడ్డిని పెద్ద మెజార్టీతో గెలిపించాలని సాయి పేట శ్రీనివాస్ కోరారు. పట్టభద్రులైన ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా పనిచేసే వ్యక్తికి ఓటు వేయాలని సాయి పేట శ్రీనివాస్ కోరారు.

# ఈ నెల 31న ఎల్లంపేట మున్సిపాలిటీలో జాబ్ మేళా

**కమిషనర్ కృష్ణారెడ్డి**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపాలిటీ లో ఈనెల 31న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఎల్లంపేట లోని సోమ ఫంక్షన్ హాల్ లో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని 14 గ్రామాల యువతి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. స్పీటా, ష్నైడర్ కే ఐ గ్రూపు, అపోలో ఫార్మసీ ఆర్ ఇ సి ఓ ఎన్, టెక్ మహీంద్రా కంపెనీలు జాబ్ మేళాలో హాజరుకానున్నాయని, ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని 14 గ్రామాల నిరుద్యోగ యువతి యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు. ఈ జాబు మేళ కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని కమిషనర్ పేర్కొన్నారు.

## బాలల ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా పరిధిలోని ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు, మొబైల్ హెల్త్ టీమ్‌ల సిబ్బందితో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్ సమావేశమయ్యారు. బాలల ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల ముందస్తు గుర్తింపు, పోషకాహార లోపాల నివారణ, అభివృద్ధి సంబంధిత సమస్యల గుర్తింపు వంటి అంశాలపై సమీక్షించారు. జననం నుంచి 18 సంవత్సరాల వయస్సు వరకు ఉన్న పిల్లలకు సమగ్ర ఆరోగ్య, అభివృద్ధి పరీక్షలు నిర్వహించడం ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం ప్రధాన లక్ష్యమని డాక్టర్ ఆనంద్ ఈ సందర్భంగా వివరించారు. ఇందులో భాగంగా పుట్టుకతో వచ్చే లోపాలు పోషకాహార లోపాలు , బాల్య వ్యాధులు , అభివృద్ధిలో జాప్యం, వైకల్యాలు అనే నాలుగు ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా పిల్లల్లో ఆరోగ్య సమస్యలను తొలిదశలోనే గుర్తించి తగిన వైద్య సేవలు అందించవచ్చని పేర్కొన్నారు. మొబైల్ హెల్త్ టీమ్‌లు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ మరియు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా ఆరు వారాల వయస్సు నుంచి ఆరు సంవత్సరాల వరకు ఉన్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాలలకు వెళ్లే పిల్లలకు ఆయా విద్యాసంస్థల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సేవలు అందించడంలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పిల్లల్లో తీవ్రమైన పోషకాహార లోపం (సెవెరే అక్యూట్ మాలన్యూట్రిషన్ - ఎస్ ఏ ఎం ), మధ్యస్థాయి పోషకాహార లోపం (మోడరేట్ అక్యూట్ - ఎం ఏ ఎం కేసులను గుర్తించి, వారి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా తగిన చర్యలు చేపట్టడం అత్యంత ముఖ్యమని వివరించారు. సాధారణ వైద్య సంరక్షణతో సమాజ స్థాయిలోనే నిర్వహించగల కేసులకు అవసరమైన పోషకాహార సహాయం, వైద్య పర్యవేక్షణ అందించాలని, ఆసుపత్రిలో చేర్పించాల్సిన అవసరం లేని పిల్లలను అనవసరంగా ఆసుపత్రులకు పంపకుండా తగిన మార్గదర్శకాల ప్రకారం సంరక్షణ కల్పించాలని తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనల సమయంలో పిల్లల్లో గుర్తించే స్వల్ప అనారోగ్య సమస్యలకు ప్రాథమిక చికిత్స అందించడంతోపాటు, సంక్లిష్టమైన ఆరోగ్య సమస్యలు ఉన్న పిల్లలను గుర్తించి, అధికారిక చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్ కార్డులో వివరాలను నమోదు చేయాలని పేర్కొన్నారు. మెరుగైన వైద్య సేవలు అవసరమైన పిల్లలను సంబంధిత ఉన్నత వైద్య కేంద్రాలకు సకాలంలో రిఫర్ చేసి, తదుపరి చికిత్స అందేలా పర్యవేక్షించడం ఆర్‌బీఎస్‌కే బృందాల బాధ్యత అని వివరించారు. పోషకాహార లోపం ఉన్న పిల్లల తల్లిదండ్రులకు శిశు, చిన్నపిల్లల పోషణ (ఇన్ఫంట్ అండ్ చైల్డ్ , వ్యక్తిగత పరిశుభ్రత, సమతుల్య ఆహారం, పిల్లల ఎదుగుదలపై నిరంతర పర్యవేక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. మామ్ స్థాయిలో ఉన్న పిల్లలు మరింత తీవ్రమైన సామ్ స్థాయికి చేరకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అవసరమని పేర్కొన్నారు. అవసరమైన పిల్లలకు ఇంటి వద్దనే తగిన చికిత్సాత్మక పోషకాహారం అందించడంతోపాటు, స్థానిక ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు క్రమం తప్పకుండా పిల్లల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించేలా సమన్వయం చేసుకోవాలని వివరించారు. బాలల ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించడం, పోషకాహార లోపాలను నివారించడం, అవసరమైన వారికి సకాలంలో వైద్య సేవలు అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన బాల్యాన్ని అందించడంలో ఆర్‌బీఎస్‌కే మొబైల్ హెల్త్ టీమ్‌లు కీలక పాత్ర పోషించాలని డాక్టర్ కె. ఆనంద్ తెలిపారు.

## ఆర్టీపీపీ విద్యుత్ ఉత్పత్తి సంక్షోభం

**కడప :** ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో ఉన్న డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ) ప్రస్తుతం తీవ్రమైన విద్యుత్ ఉత్పత్తి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. బొగ్గు మరియు నీటి కొరత కారణంగా ఈ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి తీవ్రంగా ప్రభావితమైంది. ఈ ప్లాంట్‌లో మొత్తం ఆరు యూనిట్ల ద్వారా 1650 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగాల్సి ఉంది, కానీ ప్రస్తుతం కేవలం 1050 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే జరుగుతోంది. ఈ పరిస్థితి, ముఖ్యంగా బొగ్గు నిల్వలు కేవలం మూడు రోజులకు సరిపడే స్థాయిలో ఉన్నప్పుడు, విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోతుందనే భయాన్ని కలిగిస్తోంది. ప్లాంట్‌కు రోజుకు 21 వేల టన్నుల బొగ్గు అవసరం, కానీ ప్రస్తుతం అందుబాటులో ఉన్న బొగ్గు నిల్వలు తక్కువగా ఉండటం వల్ల విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయబడే ప్రమాదం ఉంది. అంతేకాకుండా, ప్లాంట్‌కు రోజుకు 70 క్యూసెక్కుల నీరు అవసరం, కానీ వర్షాలు లేకపోవడం వల్ల నీటి కొరత కూడా తీవ్రంగా ఉంది. ఈ పరిస్థితి, గతంలో కూడా ఇలాంటి సమస్యలు ఎదుర్కొన్న ఆర్టీపీపీకి, ఇప్పుడు మరింత కష్టమైన దశలోకి తీసుకెళ్లింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, 2014 నుండి 2019 మధ్య కాలంలో ఆర్టీపీపీకి బొగ్గు కొరత సమస్యలు ఎదురయ్యాయి. అయితే, ఆ సమయంలో జగన్ తీసుకున్న చర్యల వల్ల బొగ్గు నిల్వలు 3 లక్షల టన్నుల వరకు చేరాయి. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా, ఈ ప్లాంట్ మళ్లీ పాత సమస్యలతో బాధపడుతోంది. ఆర్టీపీపీ ప్రధాన ఇంజనీర్ వాసుదేవరావు మాట్లాడుతూ, ప్రస్తుతం ప్లాంట్‌లో కేవలం మూడు రోజులకు సరిపడే బొగ్గు నిల్వలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి 1000 నుండి 1050 మెగావాట్ల మధ్య జరుగుతోంది, కానీ నీటి లభ్యత తక్కువగా ఉండటం వల్ల పరిస్థితి మరింత కష్టంగా మారుతోంది. ఏపీజెన్‌కో యాజమాన్యం ఆదేశాల మేరకు మాత్రమే ఉత్పత్తి కొనసాగుతోంది. ఈ పరిస్థితి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయబడితే, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే, వ్యాపారాలు, విద్యా సంస్థలు, మరియు ఇతర సేవలు ప్రభావితమవుతాయి. ప్రజలు ప్రభుత్వానికి ఈ సమస్యను పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యుత్ ఉత్పత్తి పెరగడానికి అవసరమైన బొగ్గు మరియు నీటి నిల్వలను పెంచడం, అలాగే ప్లాంట్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం అత్యంత అవసరం. ఈ పరిస్థితి పరిష్కరించకపోతే, రాయలసీమలో విద్యుత్ ఉత్పత్తి మరింత కష్టంగా మారవచ్చు.

# ఆంధ్రా ప్యారిస్‌లో అభివృద్ధి ఎక్కడ

- బస్టాండ్‌లో బురదగుంటల రాజ్యం- మోకాలి లోతు నీళ్లలో ప్రయాణం..
- ప్రయాణికుల సహనానికి పరీక్ష, ప్రచారానికి పట్టిన శ్రద్ధ,
- ప్రజల కష్టాలపై ఎందుకు లేదు - తెనాలి ఆర్టీసీ బస్టాండ్ దుస్థితిపై నిలదీత..
- అధికారుల కళ్లు ఎప్పుడు తెరుచుకుంటాయి..
- అభివృద్ధి ఎక్కడుంది ఆర్భాటపు మాటల్లోనా.. క్షేత్రస్థాయిలోనా



(తోట వెంకట్ - ప్రశ్న న్యూస్ ఆంధ్రప్రదేశ్ బ్యూరో)





ఆంధ్రా ప్యారిస్‌గా పేరొందిన తెనాలి పట్టణంలో అభివృద్ధి మాటలు వినిపిస్తున్నా.. ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు మాత్రం మరో వాస్తవాన్ని కళ్లకు కడుతున్నాయి. వర్షం పడితే చాలు.. బస్టాండ్ ప్రాంగణంలో నీరు నిలిచి ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదన్న ఆవేదన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా తెనాలి నుంచి మంగళగిరి, విజయవాడ వైపు వెళ్లే బస్సులు నిలిచే ప్రాంతంలో నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. మోకాలి లోతు వరకు నీరు నిలిచే పరిస్థితి ఉంటే.. బస్సు ఎక్కాలన్నా, దిగాలన్నా ప్రయాణికుల పరిస్థితి ఏమిటి? ఇదేనా పట్టణ అభివృద్ధి? ఇదేనా ప్రజలకు కల్పిస్తున్న కనీస సౌకర్యం? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవైపు పట్టణాభివృద్ధి గురించి చర్చలు.. మరోవైపు ప్రజా రవాణా కేంద్రంలో నీటి కష్టాలు! ప్రజలు నిత్యం ఉపయోగించే బస్టాండ్ పరిస్థితి ఇలా ఉంటే సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎవరిది? ప్రజాప్రతినిధులు నియోజకవర్గంలో పర్యటిస్తున్నప్పుడు ఇలాంటి సమస్యలు వారి దృష్టికి రావడం లేదా? వచ్చినా పరిష్కారానికి చర్యలు ఎందుకు కనిపించడం లేదు? తెనాలి ప్రయాణికులు సంధిస్తున్న ప్రశ్నలు ఇవే.

### బస్టాండ్‌నా.. బురదగుంటనా..

బస్టాండ్ అనేది కేవలం బస్సులు నిలిపే ప్రదేశం కాదు. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణాలకు ఆధారమయ్యే ప్రజా సదుపాయాల కేంద్రం. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలు, వృద్ధులు.. ఇలా ఎన్నో వర్గాల ప్రజలు తమ గమ్యస్థానాలకు చేరేందుకు ఆర్టీసీ బస్సులపై ఆధారపడతారు. అలాంటి చోట కనీస సౌకర్యాలు కల్పించడం సంబంధిత యంత్రాంగం ప్రాథమిక బాధ్యత. కానీ తెనాలి ఆర్టీసీ బస్టాండ్‌లో వర్షపు నీరు నిలిచే పరిస్థితి ప్రయాణికులకు సమస్యగా మారితే దాన్ని చిన్న విషయంగా ఎలా పరిగణించగలం? బస్సు వచ్చే వరకు నిలబడటానికి అనువైన ప్రదేశం లేకపోతే ఎలా? నీటిని దాటుకుంటూ బస్సు ఎక్కాల్సి వస్తే ఎలా? చేతిలో సామాన్లు, ఒడిలో చిన్నారులు ఉన్న మహిళలు, నడవడానికి ఇబ్బందిపడే వృద్ధులు నీటిలోంచి ఎలా వెళ్లాలి? నీటిలో దాగి ఉన్న గుంతలు కనిపించక ఎవరైనా జారిపడితే బాధ్యత ఎవరిది? వర్షం పడటం ప్రకృతి సహజం. కానీ వర్షం పడిన ప్రతిసారీ ప్రజలు ఇబ్బందులు పడాల్సిందేనా? నీరు నిలవకుండా డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించడం, అవసరమైన మరమ్మతులు చేపట్టడం, బస్సులు నిలిచే ప్రదేశాలను ప్రయాణికులకు అనువుగా ఉంచడం సాధ్యం కాదా? సమస్యను గుర్తించి పరిష్కరించాల్సిన అధికారులు ఈ పరిస్థితిని ఎప్పటివరకు పట్టించుకోకుండా ఉంటారు? ఇవే ఇప్పుడు కీలక ప్రశ్నలు.

### మంగళగిరి.. విజయవాడ ప్రయాణికులకు కష్టాల ప్రయాణం..

తెనాలి నుంచి మంగళగిరి, విజయవాడ వైపు వెళ్లే బస్సులు అనేకమంది ప్రయాణికులకు కీలకమైన రవాణా సదుపాయం. నిత్యం ఉద్యోగాలు, చదువులు, వ్యాపారాలు, ఇతర అవసరాల కోసం ప్రయాణించేవారికి బస్టాండ్ పరిస్థితి నేరుగా వారి దైనందిన జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. సమయానికి బస్సు అందుకోవాలనే ఆతృతలో నీటిని దాటాల్సి రావడం, దుస్తులు తడవడం, సామాన్లు తడిసిపోవడం వంటి ఇబ్బందులు ఎదురైతే ప్రయాణం ప్రారంభంలోనే అసౌకర్యం తప్పదు.ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగుల విషయంలో ఇలాంటి పరిస్థితులు మరింత ఆందోళన కలిగిస్తాయి. నీటి నిల్వ ప్రాంతంలో గుంతలు ఉన్నాయా? నేల జారే ప్రమాదం ఉందా? బస్సు ఎక్కే ప్రదేశానికి సురక్షితంగా చేరేందుకు ప్రత్యామ్నాయ మార్గం ఉందా? అనే అంశాలను అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.ప్రజా రవాణా సదుపాయాలు మెరుగుపడితేనే సామాన్యులకు నిజమైన ప్రయోజనం చేకూరుతుంది. బస్సుల సంఖ్య, రాకపోకల గురించి మాట్లాడటంతోపాటు.. ప్రయాణికులు సురక్షితంగా బస్సు ఎక్కే పరిస్థితులపైనా దృష్టి పెట్టాలి. తెనాలి బస్టాండ్‌లో నీటి సమస్యకు పరిష్కారం చూపకుండా ఉంటే అభివృద్ధి గురించి చేసే ప్రకటనలకు క్షేత్రస్థాయిలో ప్రజల అనుభవాలు భిన్నంగా కనిపించే అవకాశం ఉంది.

### ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ ఏమైంది..

ప్రజాప్రతినిధుల బాధ్యత కేవలం సభలు, సమావేశాలు, ప్రారంభోత్సవాలకే పరిమితం కాదు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడం, సంబంధిత అధికారులతో మాట్లాడటం, పరిష్కారం కోసం చర్యలు తీసుకోవడం కూడా ప్రజాప్రతినిధుల పనిలో భాగమే. తెనాలి వంటి ప్రముఖ పట్టణంలోని ప్రధాన బస్టాండ్‌లో నీరు నిలుస్తోందన్న ఫిర్యాదులు వినిపిస్తున్నప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలన జరగాల్సిన అవసరం ఉంది.స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు, మున్సిపల్ యంత్రాంగం.. ఎవరి పరిధిలో ఏ బాధ్యత ఉందో స్పష్టంచేసుకుని సమన్వయంతో పనిచేయాలి. సమస్యకు ఒక శాఖ మరొక శాఖను బాధ్యురాలిగా చూపిస్తూ కాలయాపన చేస్తే చివరికి నష్టపోయేది ప్రయాణికులే. అందుకే నీటి నిల్వకు అసలు కారణాన్ని గుర్తించి, బాధ్యతగల విభాగం వెంటనే చర్యలు చేపట్టాలి. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టడం ఎంత ముఖ్యమో, ఇప్పటికే ఉన్న ప్రజా సదుపాయాలను సక్రమంగా నిర్వహించడం కూడా అంతే ముఖ్యం. కొత్త పనులకు ప్రాధాన్యం ఇవ్వడం అవసరమే. అదే సమయంలో ప్రజలు రోజూ ఉపయోగించే బస్టాండ్ వంటి కేంద్రాలు నిర్లక్ష్యానికి గురికాకుండా చూడాలి. అభివృద్ధి అంటే కొత్త నిర్మాణాలే కాదు ఉన్న సదుపాయాలను ప్రజలకు ఉపయోగపడేలా నిర్వహించడం కూడా

### ఆర్టీసీ అధికారుల బాధ్యత లేదా..

బస్టాండ్ నిర్వహణలో ఆర్టీసీ అధికారుల పాత్ర కీలకం. అదే సమయంలో నీటి పారుదల, డ్రైనేజీ, ప్రాంగణ మరమ్మతులు వంటి అంశాల్లో సంబంధిత స్థానిక సంస్థల పరిధి ఏమిటో గుర్తించాలి. అందరూ తమ పరిధిలోని బాధ్యతలను స్పష్టంగా నిర్వర్తిస్తే సమస్య పరిష్కారానికి మార్గం సుగమమవుతుంది.నీరు నిలిచే ప్రాంతాన్ని అధికారులు స్వయంగా పరిశీలించాలి. సమస్య తీవ్రతను అంచనా వేయాలి. తక్షణ చర్యలతోపాటు శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక రూపొందించాలి. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ అవసరమైన హెచ్చరికలు, సురక్షిత నడక మార్గాలు ఏర్పాటు చేయాలి. మరమ్మతులు పూర్తయ్యే వరకు తాత్కాలిక ఇబ్బందులను తగ్గించే చర్యలు చేపట్టాలి. అంతేకాదు, సమస్య పరిష్కారంపై ప్రజలకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలి. ఎప్పుడు పనులు ప్రారంభమవుతాయి? ఎప్పుడు పూర్తవుతాయి? నిర్వహణ బాధ్యత ఎవరిది? అనే వివరాలు బహిరంగంగా తెలియజేయడం ద్వారా జవాబుదారీతనం పెరుగుతుంది. ప్రచారంలో కనిపించే అభివృద్ధి కంటే ప్రజల ప్రయాణంలో కనిపించే మార్పే వారికి ఎక్కువ ముఖ్యం.

# ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చొద్దు

**బీసీ-ఏలోని 57 ఉపకులాలకు అన్యాయం చేయవద్దు**

**ముఖ్యమంత్రి తన ప్రకటనను వెనక్కి తీసుకోవాలి**

**రేవంత్ రెడ్డికి తెలంగాణ లోని కులాలపై అవగాహన లేకనే ఈ ప్రకటనలు**

**తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర డిమాండ్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో బీసీ-ఏ కేటగిరీలో ఇప్పటికే ఉన్న 57 ఉపకులాల సామాజిక న్యాయం విద్యా ఉద్యోగ అవకాశాలు రిజర్వేషన్ ప్రయోజనాలకు ఎలాంటి నష్టం కలగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర డిమాండ్ చేశారు.బీసీ-ఏలోని 57 ఉపకులాల హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన పేర్కొన్నారు ఇప్పటికే పరిమిత అవకాశాలతో ముందుకు సాగుతున్న ఆయా కులాల ప్రజలకు మరింత అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. ముదిరాజ్‌లను బీసీ-ఏ కేటగిరీలో చేర్చే ప్రతిపాదనపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని, దీనివల్ల ఇప్పటికే బీసీ-ఏలో ఉన్న 57 ఉపకులాల రిజర్వేషన్ ప్రయోజనాలపై ఎలాంటి ప్రభావం పడుతుందో సమగ్రంగా పరిశీలించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.బీసీ-ఏలోని 57 ఉపకులాల హక్కులకు భంగం కలగకూడదనేదే మా ప్రధాన డిమాండ్ ఈ అంశంపై ముఖ్యమంత్రి చేసిన ప్రకటనను వెనక్కి తీసుకొని సంబంధిత సంఘాలతో చర్చించి, సామాజిక న్యాయానికి అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర కోరారు.ప్రభుత్వం ఈ సమస్యపై తక్షణమే స్పందించి, బీసీ-ఏలోని అన్ని ఉపకులాల హక్కులు భవిష్యత్తు అవకాశాలకు భరోసా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

# శ్రీశైలంలో ఆధ్యాత్మిక వైభవం

**సుబ్రహ్మణ్యస్వామి, సాక్షిగణపతికి ప్రత్యేక అభిషేకాలు**

**250 మంది చెంచు గిరిజనులకు ఉచిత స్పర్శదర్శనం**





శ్రీశైలం (ప్రశ్న న్యూస్) దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీశైల మహాక్షేత్రంలో బుధవారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ శ్రీ సుబ్రహ్మణ్యస్వామి, శ్రీ సాక్షిగణపతి స్వామివార్లకు దేవస్థానం ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరోవైపు 250 మంది చెంచు గిరిజన భక్తులకు ఉచిత స్పర్శదర్శనం కల్పించారు.

### కృత్తికా నక్షత్రం ప్రత్యేక అభిషేకాలు..

కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని కుమారస్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీరు, వివిధ పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. ప్రజలకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు వృద్ధి చెందాలని అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. సాక్షిగణపతి స్వామివారికి పంచామృతాలు, వివిధ పవిత్ర జలాలతో అభిషేకం చేసి పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు నిర్వహించారు.

### చెంచు గిరిజనులకు ఉచిత దర్శనం..

శ్రీశైల క్షేత్రంతో విడదీయలేని అనుబంధం కలిగిన చెంచు గిరిజనులకు అక్టోబర్ 28న ప్రత్యేక దర్శన సదుపాయం కల్పించారు. స్థానిక గూడేలు, పల్నాడు, మార్కాపురం ప్రాంతాల నుంచి వచ్చిన 250 మంది భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. సంప్రదాయ తప్పెట వాయిద్యాలు, చెంచు నృత్యాలతో వారి రాక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద దేవస్థానం సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం అన్నపూర్ణ ప్రసాద వితరణ భవనంలో అన్నప్రసాదాలు అందించారు.ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు గిరిజన భక్తులకు ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద వితరణ చేపట్టడం ద్వారా శ్రీశైల దేవస్థానం భక్తి, సంప్రదాయం, సామాజిక సమానత్వానికి ప్రాధాన్యమిచ్చింది.

# ఇంటర్ విద్యను చెరబట్టిన 'పంచభూతాలు' ఎవరు.?

**- తెలంగాణ ఇంటర్ బోర్డులో ఐదుగురు అధికారులపై తీవ్ర అవినీతి ఆరోపణలు**

**- ప్రమోషన్లు, బదిలీలు, క్రమబద్ధీకరణల్లో అక్రమాలంటూ ఫిర్యాదులు - సమాచార హక్కు చట్టం అమలుపైనా అనుమానాలు**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలో అవినీతి ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తుకు పునాదిగా నిలవాల్సిన ఇంటర్ బోర్డులో కొందరు ఉన్నతాధికారులు కీలక స్థానాల్లో ఏళ్ల తరబడి కొనసాగుతూ తమకు అనుకూలమైన వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐదుగురు అధికారుల చుట్టూ తిరుగుతున్న ఆరోపణలు, ప్రమోషన్లు, బదిలీలు, ఉద్యోగుల క్రమబద్ధీకరణలో అక్రమాలు జరిగాయనే ఫిర్యాదులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

### స్నేహబంధాలే అధికారానికి అడ్డా.?

గతంలో రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసిన జయప్రద భాయ్ తనకు అనుకూలమైన అధికారులను కీలక విభాగాల్లో నియమించుకునేలా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వంటి కీలక బాధ్యతల్లో కొనసాగుతున్న నేపథ్యంలో, పరీక్షల నిర్వహణతో పాటు బోర్డులోని ఇతర వ్యవహారాలపైనా ఆమె ప్రభావం ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
నాన్ టీచింగ్ సిబ్బంది ప్రమోషన్లు, లైబ్రేరియన్ల పదోన్నతులు, ఎంటీఎస్ నుంచి రెగ్యులర్ ఉద్యోగులుగా క్రమబద్ధీకరణ, ప్రిన్సిపాళ్ల ప్రమోషన్లు, బదిలీల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై అధికారిక రికార్డుల ఆధారంగా విచారణ జరపాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

### క్రమబద్ధీకరణలో అక్రమాలున్నాయా.?

ఏడీ ప్రసన్నలతపై కూడా కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణతో పాటు ఇతర పరిపాలనా వ్యవహారాల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఆమె ఉద్యోగ నియామకానికి సంబంధించిన అర్హతలు, నివేదికలపై అభ్యంతరాలు వ్యక్తమైనట్లు సమాచారం. కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణలో నిబంధనలు పాటించారా.? అర్హులైన వారికే న్యాయం జరిగిందా.? అనే అంశాలపై స్వతంత్ర విచారణ చేపట్టాలని ఉద్యోగ వర్గాలు కోరుతున్నాయి.

### సెక్షన్లలో పెత్తనం.. ఆర్టీఐకి అడ్డంకులా.?




సూపరింటెండెంట్ పెంటయ్యపై కీలక ఫైళ్ల నిర్వహణ, ఉద్యోగుల క్రమబద్ధీకరణలో నిబంధనల ఉల్లంఘన, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో ఉద్యోగి నుంచి భారీ మొత్తాలు వసూలు చేశారనే ప్రచారంపైనా దర్యాప్తు జరగాలని బాధితులు కోరుతున్నారు. అప్పటి కమిషనర్ కృష్ణ ఆదిత్య విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెబుతున్న నేపథ్యంలో, ఆ ఫిర్యాదు వివరాలు, దర్యాప్తు పురోగతిని బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది.
మరోవైపు రచ్చ జ్యోత్స్నారాణి కీలక విభాగాల్లో కొనసాగుతూ సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు పొందడంపై ప్రభావం చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వెంకటేశ్వర్లుపైనా పనుల కోసం డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలను నిర్ధారించే ఆధారాలు, సంబంధిత అధికారుల స్పందన వెలుగులోకి రావాల్సి ఉంది.

### ప్రభుత్వం స్పందించాలి, విజిలెన్స్ విచారణ జరపాలి

ఇంటర్ బోర్డులో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల ఆధ్వర్యంలోనే విచారణలు జరిగితే నిష్పాక్షికతపై అనుమానాలు తలెత్తే అవకాశం ఉందని విమర్శకులు అంటున్నారు. అందువల్ల విజిలెన్స్ లేదా ఇతర స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించి, ప్రమోషన్లు, బదిలీలు, క్రమబద్ధీకరణలకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించాలని కోరుతున్నారు.విద్యాశాఖ మంత్రి, ముఖ్యమంత్రి తక్షణమే స్పందించాలి. ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సేకరించి, అవసరమైతే నిబంధనల ప్రకారం సంబంధిత అధికారులను కీలక బాధ్యతల నుంచి తప్పించి, పారదర్శక విచారణకు మార్గం సుగమం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి; నిరాధారమైతే వాస్తవాలను స్పష్టం చేయాలి. అప్పుడే తెలంగాణ ఇంటర్ విద్యా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం నిలుస్తుంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588